విలేకరులు కావలెను

తెలంగాణ వాణి

తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా విలేకర్లు కావలెను.
పొలిటికల్, ప్రజాసమస్యలు, అక్రమాలపై వార్త రాసే పట్టు కలిగిన వారికి మొదటి ప్రాధాన్యత ఇవ్వబడును

9703247143

TELANGANA VANI TELUGU DAILY

తెలంగాణ వాణి

R N I No. APTEL/2012/53127

తెలుగు దినపత్రిక

తెలంగాణ వాణి TV
THE VOICE OF TELANGANA

ఎడిటర్ జేరిపోతుల సంపత్
9912758107

సంపుటి: 16 | సంచిక : 215 | బుధవారం14.10. 2026 | ఎడిటర్ఃజేరిపోతుల సంపత్ | కరీంనగర్ | పేజీలు 8 | వెల: 5.00

దేశంలోని జర్నలిస్టులకు, మహిళలకు రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలి

కేంద్ర మంత్రి జి కిషన్ రెడ్డి



స్త్రీ శక్తిని, అమ్మవారిని ఆరాధిస్తూ దేశమంతా నవరాత్రి ఉత్సవాలు జరుపుకుంటున్న సమయంలో.. మూడు నెలల గర్భిణి అయిన ఓ మహిళా జర్నలిస్టుపై రాహుల్ గాంధీ అందరూ చూస్తుండగానే దాడి చేశారు.

ఆస్పత్రి నుంచి ఆ జర్నలిస్టు తనకు ఎదురైన చేదు అనుభవాన్ని వివరిస్తుంటే.. రాహుల్ గాంధీ, ఆయన బృందం ఎంత అమానవీయంగా వ్యవహరించారో అర్థమవుతోంది. ఆమె గొంతు వినిపించకుండా నినాదాలు చేస్తూ.. ఆమె ఆవేదనను కూడా అణచివేసేందుకు ప్రయత్నించారు.

రాహుల్ గాంధీ చర్యల కారణంగా కడుపులో స్వల్ప నొప్పి రావడంతో.. మహిళా జర్నలిస్టు రిచాను ఆస్పత్రికి తీసుకెళ్లాల్సి వచ్చింది. రాహుల్ గాంధీ ప్రతిపక్ష నేత హోదాలో ఉంటూ గూండాలా వ్యవహరిస్తున్నారు. ఇలాంటి దుర్మార్గమైన ప్రవర్తనకు దేశంలోని జర్నలిస్టులందరికీ, మహిళలందరికీ ఆయన క్షమాపణ చెప్పాలి.

డీఎస్సీ-2008 అభ్యర్థులకు హైకోర్టు షాక్

మూడు పిటిషన్లు కొట్టివేత

జీవో నంబర్ 28 సవరణపై అభ్యంతరాలు

2008 నాటి నియామకాల నిబంధనలపై విచారణ

పిటిషనర్ల వాదనలను తోసిపుచ్చిన ధర్మాసనం

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన డీఎస్సీ 2008 ఉపాధ్యాయ నియామకాల వివాదానికి సంబంధించి తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ప్రభుత్వ జీవో నంబర్ 28.. నియామక నిబంధనల్లో చేసిన మార్పులను సవాల్ చేస్తూ దాఖలైన 3 రిట్ పిటిషన్లను ధర్మాసనం కొట్టివేసింది. నోటిఫికేషన్ విడుదలైన తర్వాత నిబంధనల్లో మార్పులు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేసిన అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. సుదీర్ఘ విచారణ అనంతరం ఈ నిర్ణయం వెలువడింది. దీంతో డీఎస్సీ-2008 నియామకాలకు సంబంధించిన న్యాయ వివాదంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది.

ఫహైదరాబాద్ తెలంగాణ వాణి)



ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో చేపట్టిన డీఎస్సీ 2008 ఉపాధ్యాయ నియామకాల వివాదానికి సంబంధించి తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. ప్రభుత్వ జీవో నంబర్ 28.. నియామక నిబంధనల్లో చేసిన మార్పులను సవాల్ చేస్తూ దాఖలైన 3రిట్ పిటిషన్లను ధర్మాసనం కొట్టివేసింది. నోటిఫికేషన్ విడుదలైన తర్వాత నిబంధనల్లో మార్పులు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేసిన అభ్యర్థులు న్యాయస్థానాన్ని ఆశ్రయించగా.. సుదీర్ఘ విచారణ అనంతరం ఈ నిర్ణయం వెలువడింది. దీంతో డీఎస్సీ-2008 నియామకాలకు సంబంధించిన న్యాయ వివాదంలో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2008 డిసెంబర్‌లో ఉపాధ్యాయ పోస్టుల భర్తీ కోసం డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేసింది.ఈ నోటిఫికేషన్ ద్వారా మొత్తం 52,655 ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని అప్పటి రాష్ట్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకోగా..

- మిగతా 2 లో..



తెలంగాణ రహదారులకు కేంద్రం పచ్చజెండా!

ఎల్బీనగర్-హయత్‌నగర్ రెండంతస్తుల ఎలివేటెడ్ కారిడార్‌కు ఆమోదం

జనవరిలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారి విస్తరణ పనులు

ఐదు రోప్‌వేలు, మూడు రైల్వే పైవంతెనలకు గ్రీన్‌సిగ్నల్

కేంద్ర మంత్రి గడ్కరీతో కోమటిరెడ్డి భేటీ.. పలు ప్రాజెక్టులపై కీలక చర్చ

ఫహైదరాబాద్ తెలంగాణ వాణి)

తెలంగాణలో రహదారుల అభివృద్ధికి కేంద్రం పచ్చజెండా ఊపింది. రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక మౌలిక వసతుల ప్రాజెక్టులకు కేంద్ర రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీ ఆమోదం తెలిపారు.మంగళవారం ఢిల్లీలో రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఆయనతో సమావేశమై పలు ప్రతిపాదనలపై చర్చించారు. ఎల్బీనగర్-హయత్‌నగర్ రెండంతస్తుల ఎలివేటెడ్ కారిడార్‌ను వార్షిక ప్రణాళికలో చేర్చేందుకు గడ్కరీ అంగీకరించారు. ఈ మార్గంలోని 54 కాలనాల్లో నివసిస్తున్న పది లక్షల మందికి ట్రాఫిక్ ఇబ్బందులు తగ్గనున్నాయని మంత్రి వివరించారు.

హైదరాబాద్-విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారి-65ను 6ం2 వరుసలుగా విస్తరించేందుకు నవంబర్‌లో టెండర్ల ప్రక్రియ పూర్తిచేసి, 2027 జనవరిలో పనులు ప్రారంభిస్తామని గడ్కరీ హామీ ఇచ్చారు. కృష్ణా నదిపై సోమశిల-సంగమేశ్వరం మధ్య నిర్మించనున్న తీగల వంతెన శంకుస్థాపనకు అంగీకరించారు. దీని నిర్మాణంతో తిరుపతికి 80 కిలోమీటర్ల దూరం, మూడు గంటల ప్రయాణ సమయం తగ్గనుంది. హైదరాబాద్-శ్రీశైలం జాతీయ రహదారి-765పై

- మిగతా 2 లో..

సింగరేణి కార్మికులకు దసరా కానుక

- ఒక్కో పర్మినెంట్ ఉద్యోగికి రూ.1,53,912 లాభాల వాటా
- 29,717 మంది కాంట్రాక్టు కార్మికులకు రూ.5,500 బోనస్
- 15 రోజుల్లో పెండింగ్ డిపెండెంట్ ఉద్యోగాల సమస్యల పరిష్కారం: డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క

కొత్తగూడెం, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి):
సింగరేణి కార్మికులకు దసరా పండుగ సందర్భంగా తెలంగాణ ప్రభుత్వం తీపి కబురు అందించింది. సంస్థలో పనిచేస్తున్న 38,737 మంది పర్మినెంట్ ఉద్యోగులకు ఒక్కొక్కరికి సగటున రూ.1,53,912 చొప్పున లాభాల వాటా అందించనున్నట్లు ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క ప్రకటించారు. అలాగే 29,717 మంది కాంట్రాక్టు కార్మికులకు ఒక్కొక్కరికి రూ.5,500 చొప్పున బోనస్ చెల్లించనున్నట్లు వెల్లడించారు. మంగళవారం మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబుతో కలిసి నిర్వహించిన మీడియా సమావేశంలో భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. సింగరేణి ఈ ఏడాది ఆర్జించిన రూ.1,754 కోట్ల నికర లాభాల్లో 34 శాతం వాటాగా సుమారు రూ.596 కోట్లను కార్మికులకు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.



కార్మికుల సమస్యలకు త్వరలో పరిష్కారం

ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న సుమారు 250 నుంచి 300 డిపెండెంట్ ఉద్యోగాల ఉత్తర్వులను 15 రోజుల్లో జారీ చేసేలా చర్యలు తీసుకుంటామని భట్టి విక్రమార్క తెలిపారు. కార్మికుల మారుపేర్ల సమస్యలను మానవీయ దృక్పథంతో పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. మెడికల్ ఇన్వాలిడేషన్ ప్రక్రియను వేగవంతం చేయడంతోపాటు ఏరియా ఆసుపత్రుల్లోనే వైద్య బోర్డులు నిర్వహించేలా ఆదేశించినట్లు పేర్కొన్నారు. సింగరేణి కార్మికుల సొంతింటి కలను సాకారం చేసేందుకు ప్రత్యేక కార్యాచరణ రూపొందిస్తున్నామని, అర్హులకు ఇళ్ల స్థలాలు అందించే ప్రక్రియను వేగవంతం చేస్తామని చెప్పారు. సింగరేణి ఆసుపత్రులను ఆధునికీకరించి మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తెస్తామన్నారు. కార్మికుల భద్రత, కుటుంబాల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తుందని స్పష్టం చేశారు.

కొత్త బొగ్గు బ్లాక్‌లపై దృష్టి

సింగరేణి లాభాలు తగ్గడానికి గత పదేళ్లలో కొత్త బొగ్గు బ్లాక్‌ల సాధనలో బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమవడం కూడా కారణమని భట్టి విక్రమార్క విమర్శించారు. సంస్థను బలోపేతం చేసేందుకు కొత్త బొగ్గు బ్లాక్‌ల సాధనతోపాటు మార్కెట్‌కు అనుగుణంగా బొగ్గు ధరల సర్దుబాటు, విద్యుత్ సంస్థల నుంచి రావాల్సిన బకాయిల వసూలుపై దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు.

బీఆర్ఎస్ పోరుబాట హాస్యాస్పదం: శ్రీధర్‌బాబు

సింగరేణిని పదేళ్లపాటు పాలించిన బీఆర్ఎస్ ప్రభుత్వం కార్మికుల సమస్యలను పరిష్కరించలేదని మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు సమస్యలను పట్టించుకోని నాయకులు ఇప్పుడు పోరుబాట పేరుతో ఆందోళనలకు పిలుపునివ్వడం హాస్యాస్పదమన్నారు. కార్మికుల సంక్షేమం, సంస్థ అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కోల్‌బెల్ట్ ఎమ్మెల్యేలు, ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టర్, సింగరేణి సీఎండీ డాక్టర్ బుద్ధప్రకాష్ జ్యోతి, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

ఓటు నమోదుకు మరో ఛాన్స్

ఫహైదరాబాద్ తెలంగాణ వాణి)

- సీఈవో సుదర్శన్ రెడ్డి కీలక ప్రకటన
- నోటీసుల పంపిణీ ఇంకా పూర్తి కావాల్సి ఉంది
- అర్హులైన వారందరి పేర్లను వచ్చే నవంబర్ 9న విడుదల

తెలంగాణలో కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల జాబితా సవరణ కోసం ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. కొత్తగా అర్హత సాధించిన వారు, ముసాయిదా జాబితాలో పేర్లు లేని వారి కోసం ప్రత్యేక క్యాంప్‌లను ఏర్పాటు చేస్తున్నట్లుగా రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి వెల్లడించారు. ఈనెల 15, 16 తేదీల్లో రాష్ట్రవ్యాప్తంగా ప్రత్యేక ఓటర్ల నమోదు శిబిరాలు నిర్వహించనున్నట్లుగా పేర్కొన్నారు. కొత్తగా 18 సంవత్సరాలు నిండిన యువ ఓటర్లు ఈ క్యాంప్‌లను సద్వినియోగం చేసుకుని ఫారమ్-6

- మిగతా 2 లో..



పీడీఎస్‌యూ నేత మంజులకు సిద్దెల రవి ఘన నివాళి

కొత్తగూడెం, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి)



పీడీఎస్‌యూ రాష్ట్ర నాయకురాలు కామ్రేడ్ జాడి మంజులకు ప్రముఖ విద్యావేత్త, అంబేద్కర్ జాతీయ ఫెలోషిప్ అవార్డు గ్రహీత సిద్దెల రవి ఘన నివాళులర్పించారు. వామపక్ష విద్యార్థి ఉద్యమ నాయకురాలిగా విద్యార్థుల సమస్యలపై పోరాడిన మంజుల, తెలంగాణ మలిదశ ఉద్యమంలోనూ కెరటంలా ముందుకు సాగారని కొనియాడారు. విద్యార్థి ఉద్యమాలతో పాటు సామాజిక ఉద్యమాల్లో ఆమె చేసిన పోరాటాలు చిరస్మరణీయమని పేర్కొన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం, విద్యార్థుల హక్కుల సాధన కోసం ఆమె సాగించిన పోరాట స్ఫూర్తి భావితరాలకు ఆదర్శంగా నిలుస్తుందని తెలిపారు. కామ్రేడ్ మంజులకు సామాజిక ఉద్యమాల తరఫున జోహార్లు అర్పిస్తున్నట్లు సిద్దెల రవి పేర్కొన్నారు.

మంజుల మృతి ప్రజా ఉద్యమాలకు తీరని లోటు



- మంజుల ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి
- కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్ మూడ్ గణేష్

కొత్తగూడెం, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి)

విద్యార్థి, ప్రజా ఉద్యమాల్లో చురుగ్గా పాల్గొన్న మంజుల అకాల మరణం ప్రజా ఉద్యమాలకు తీరని లోటని కొత్తగూడెం కార్పొరేషన్ మేయర్, సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు మూడ్ గణేష్ అన్నారు. సిపిఐ (ఎమ్మెల్) న్యూ డెమోక్రసీ పట్టణ నాయకురాలు, జర్నలిస్టు మంజుల అనారోగ్యంతో మృతిచెందగా, ప్రజలు, పార్టీ శ్రేణుల సంద ర్శనార్థం ఆమె భౌతికకాయాన్ని స్థానిక ఐఎఫ్టీయూ కార్యాలయంలో ఉంచారు. మంగళవారం ఐఎఫ్టీయూ కార్యాలయానికి చేరుకున్న మేయర్ మూడ్ గణేష్ ఆమె భౌతికకాయాన్ని సందర్శించి, పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం జరిగిన సంతాప సభలో ఆయన మాట్లాడుతూ.. పీడీఎస్యూలో సుదీర్ఘకాలం పనిచేసి విద్యార్థి సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసిన నిబద్ధత గల వ్యక్తి మంజుల అని కొనియాడారు. విద్యార్థి ఉద్యమాల నుంచి జర్నలిస్టుగా, ప్రజా ఉద్యమ నేతగా ప్రజల పక్షాన నిలిచి గళమెత్తారని గుర్తుచేసుకున్నారు. ఆమె ఆశయాలను ముందుకు తీసుకెళ్లడమే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. భర్త, జర్నలిస్టు జంపన్నకు, వారి కుమారుడికి, కుటుంబ సభ్యులకు ఈ సందర్భంగా ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కష్ట సమయంలో కుటుంబానికి ప్రజా శ్రేణులు అండగా నిలవాలని ఆయన కోరారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు ఉప్పుశెట్టి రాహుల్, జిల్లా సమితి సభ్యులు నేరెళ్ల రమేష్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వర్మ అజిత్ తదితరులు వున్నారు.

పీఎంయూ టెండర్లను ప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలి

- పాత పద్ధతిలోనే స్థానిక వెండర్ల ద్వారా ప్రభుత్వ హాస్టళ్లకు సరుకులు సరఫరా చేయాలి
- మాజీ మంత్రి హరీశ్ రావు డిమాండ్
- ప్రభుత్వ పెద్దల కమీషన్ల కోసం బ్లాక్‌లిస్ట్ సంస్థకు టెండర్ కట్టబెట్టడం దుర్మార్గం

2



TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక

లక్ష్య సాధనకు నిరంతర శ్రమ అవసరం

అభ్యర్థులకు కలెక్టర్ రాజర్షి షా సూచన



ఆదిలాబాద్, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి ప్రతినిధి)
లక్ష్యాన్ని సాధించే వరకు పక్కా ప్రణాళికతో నిరంతరం శ్రమించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా సూచించారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఎస్సై, కానిస్టేబుల్ శిక్షణ అభ్యర్థులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేసి, నూతన ఐఎఫ్‌పీ ప్యానెల్, వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. స్టడీ సర్కిల్‌లో శిక్షణ పొంది కానిస్టేబుల్ ఉద్యోగం సాధించిన ఉమ భారతిని శాలువాతో సత్కరించారు. అభ్యర్థులు క్రమం తప్పకుండా తరగతులకు హాజరవుతూ, ప్రిలిమ్స్‌తో పాటు శారీరక పరీక్షలపై దృష్టి పెట్టాలని సూచించారు. పరిమిత పాఠ్యాంశాలను పదేపదే పునశ్చరణ చేయడం, గత ప్రశ్నపత్రాలను సాధన చేయడం విజయానికి దోహదపడతాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా బీసీ సంక్షేమ శాఖ అధికారి సోనియా, బీసీ, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్లు ప్రవీణ్, రమేష్, అధ్యాపకులు, అభ్యర్థులు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి రెజ్లింగ్‌లో గిరిజన విద్యార్థుల పతకాల పంట



భద్రాచలం, అక్టోబర్ 13 న్యూస్ (తెలంగాణ వాణి):
నారాయణపేట జిల్లాలో అక్టోబర్ 11 నుంచి 13 వరకు నిర్వహించిన ఎస్‌జీఎఫ్ అండర్-14 రాష్ట్రస్థాయి రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్--2026లో భద్రాచలం ఐటీడీఏ పరిధిలోని గిరిజన విద్యార్థులు ప్రతిభ చాటారు. ఉప్పుసాక, బొజ్జాయిగూడెం ఆశ్రమ పాఠశాలలకు చెందిన ముగ్గురు విద్యార్థులు పతకాలు సాధించారు. ఉప్పుసాక ఆశ్రమ పాఠశాలకు చెందిన ఆరో తరగతి విద్యార్థి బి. అభిరామ్ 37 కేజీల విభాగంలో రజత పతకం సాధించగా, ఎనిమిదో తరగతి విద్యార్థి జి. నేహాల్ 35 కేజీల విభాగంలో కాంస్య పతకం గెలుచుకున్నాడు. బొజ్జాయిగూడెం ఆశ్రమ పాఠశాలకు చెందిన బి. అఖిల్ 44 కేజీల విభాగంలో కాంస్య పతకం సాధించాడు. విజేతలకు నారాయణపేట జిల్లా రెజ్లింగ్ అసోసియేషన్ అధ్యక్షుడు నరసింహులు బహుమతులు అందజేశారు. విద్యార్థుల విజయంతో గిరిజన ప్రాంతంలో క్రీడాస్ఫూర్తి వెల్లివిరిసింది.

ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలి: సబ్ కలెక్టర్



భద్రాచలం, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి):
భద్రాచలం ఆర్టీసీ బస్టాండ్‌కు వచ్చే ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ ఆర్టీసీ అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆయన భద్రాచలం ఆర్టీసీ ప్రయాణ ప్రాంగణాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి, ప్రయాణికులకు అందుతున్న సౌకర్యాలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా సబ్ కలెక్టర్ మాట్లాడుతూ, భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దర్శనానికి దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు వస్తుంటారని తెలిపారు. ప్రయాణికులకు తాగునీరు, మరుగుదొడ్లు, పరిశుభ్రమైన పరిసరాలు వంటి ప్రాథమిక సదుపాయాలు తప్పనిసరిగా అందుబాటులో ఉంచాలన్నారు. బస్టాండ్‌లో ఏవైనా లోపాలు ఉంటే వెంటనే సరిదిద్దాలని, చల్లని, సురక్షితమైన తాగునీరు అందించాలని సూచించారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా నిరంతరం పరిశుభ్రతను పర్యవేక్షించాలని ఆదేశించారు. ఈ తనిఖీలో ఆర్టీసీ డిపో మేనేజర్ జంగయ్య, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

గోదావరి పుష్కరాల పనులు వేగవంతం చేయాలి: కలెక్టర్ అంకిత్



భద్రాచలం, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి)
గోదావరి పుష్కరాల ఏర్పాట్లను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ అంకిత్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, సంబంధిత శాఖల అధికారులతో కలిసి భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ అభివృద్ధి పనులు, గోదావరి పుష్కర ఘాట్ల నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆలయ ఉత్తర, దక్షిణ ప్రాంతాల్లో జరుగుతున్న నిర్మాణాలను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని సూచించారు. ఉత్తర వైపు 270 మీటర్లు, దక్షిణ వైపు 230 మీటర్ల మేర చేపడుతున్న పుష్కర ఘాట్ల పనులను వేగవంతం చేయాలన్నారు. భక్తుల రాకపోకలకు ఇబ్బందులు లేకుండా ఆలయం నుంచి స్నాన ఘాట్లకు వెళ్లే రహదారిని 25 అడుగుల నుంచి 30 అడుగులకు విస్తరించే ప్రతిపాదనను పరిశీలించారు. వైకుంఠధామానికి ప్రత్యామ్నాయ రహదారి ఏర్పాటు, ప్రహరీ నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. ఐటీసీ నుంచి భద్రాచలం బ్రిడ్జి వరకు సుమారు మూడు కిలోమీటర్ల రహదారిని సుందరీకరించేందుకు వారం రోజుల్లో ప్రణాళిక రూపొందించాలని సూచించారు. భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు, రవాణా, వైద్య సేవలు, భద్రత వంటి సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. పర్ణశాల, చర్ల, అశ్వాపురం, దుమ్ముగూడెం, కిన్నెరసాని ప్రాంతాల్లోనూ ఏర్పాట్లపై దృష్టి సారించాలని పేర్కొన్నారు. ఈ పరిశీలనలో దేవస్థానం ఈవో దామోదర్ రావు, ఆర్‌అండ్‌బీ అధికారులు, వివిధ శాఖల ప్రతినిధులు పాల్గొన్నారు.

అంతర్జాతీయ విపత్తు ముప్పు తగ్గింపు దినోత్సవం





ఖమ్మం, అక్టోబర్ -13 (తెలంగాణ వాణి)
ఖమ్మం, ప్రియదర్శిని ఇన్స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నోలజీ ఫర్ ఉమెన్ కళాశాలలో మేరా యువ భారత్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ విపత్తు ముప్పు తగ్గింపు దినోత్సవం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా స్టేట్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫండ్ టి. వెంకటేష్ పాల్గొన్నారు. టి. వెంకటేష్ మాట్లాడుతూ తుఫానులు, వరదలు, భూకంపాలు, అగ్నిప్రమాదాలు వంటి ప్రకృతి లేదా మానవ తప్పిదాల వల్ల సంభవించే విపత్తుల సమయంలో బాధితులకు తక్షణ ఆర్థిక సహాయం అందించడానికి, ప్రాణ, ఆస్తినష్టం జరిగినప్పుడు సహాయక చర్యలు ఎలా చేపట్టాలి మనకి మనం ఎలా కాపాడుకోవాలి, ఇతరులను ఎలా కాపాడాలి అనే విద్యార్థులకు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ జి. గోపాల్ కళాశాల ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ శివకుమార్, మేరా యువ భారత్ అకౌంట్ మరియు ప్రోగ్రామ్ ఆఫీసర్ కే. భానుచందర్, ఎన్వోవి భార్గవి, శిరీష పాల్గొన్నారు. విద్యార్థులకు వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహించగా అందులో గెలుపొందిన వారికి బహుమతులు సర్టిఫికెట్స్ అందజేశారు. అనంతరం విద్యార్థులతో ర్యాలీ తీయించడం జరిగింది.

మేరామా భవాని విజయదశమి ఉత్సవాల కరపత్రాలు, గోడపత్రికల ఆవిష్కరణ



టేకులపల్లి, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి)
టేకులపల్లి మండల కేంద్రంలోని సేవాగఢ్ ఆలయ క్షేత్రంలో ఈ నెల 18, 19, 20 తేదీల్లో నిర్వహించనున్న శ్రీశ్రీ మేరామా భవాని (జగదంబ దేవి) విజయదశమి ఉత్సవాల కరపత్రాలు, గోడపత్రికలను మంగళవారం ఆవిష్కరించారు. మూడు రోజుల పాటు పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు, జగజ్జనని దివ్య శోభాయాత్ర, మహా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఉత్సవ కమిటీ సభ్యులు తెలిపారు. భక్తులు కుటుంబ సమేతంగా పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త భూక్య గన్నా నాయక్, టేకులపల్లి సర్పంచ్ బోడ బాలు నాయక్, గోలియా తండా సర్పంచ్ లకావత్ నాకా, దాసు తండా సర్పంచ్ చందర్ సింగ్, చుక్కల బోడు సర్పంచ్ రామ నాయక్, ధరావత్ ప్రేమ్‌చంద్ నాయక్, లక్కినేని సురేందర్‌రావు, భూక్య దల్ సింగ్ నాయక్, గుడిపూడి మోహన్‌రావు, పుణ్య నాయక్, భూక్య కిషోర్ సింగ్ నాయక్, భూక్య దేవా నాయక్, బానోత్ సక్రు నాయక్, ధరావత్ సురేష్ నాయక్, భూక్య లాలు నాయక్, కృష్ణ నాయక్, ఏపూరి సీతయ్య, నెల్లూరి సత్యం, బాలకృష్ణ, బాలాజీ, సేవ్య తదితరులు పాల్గొన్నారు.

సంతాప పరామర్శ-ఆర్థిక సహాయం



టేకులపల్లి, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి)
కిష్టారం గ్రామానికి చెందిన కంగాల కన్నయ్య,జబ్బ రాఘవులు అనారోగ్యంతో మృతి చెందడంతో,వారి నివాసాలకు వెళ్లి భౌతికకాయాలకు నివాళులర్పించిన కాంగ్రెస్ పార్టీ నాయకులు కోరం సురేందర్. అనంతరం మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి మనోధైర్యాన్ని అందించారు. ఈ సందర్భంగా కంగాల కన్నయ్య కుటుంబానికి 10,000/-, జబ్బ రాఘవులు కుటుంబానికి 5,000/-చొప్పున ఆర్థిక సహాయం అందించి, కష్టకాలంలో బాధిత కుటుంబాలకు అండగా నిలిచారు. ప్రజల కష్టసుఖాల్లో తోడుగా ఉంటూ,ఆపదలో ఉన్న కుటుంబాలకు తన వంతు సహాయం అందిస్తూ ముందుకు సాగుతున్న కోరం సురేందర్ సేవా దృక్పథం అభినందనీయం.మృతుల ఆత్మలకు శాంతి చేకూరాలని,వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నాం. ఈ కార్యక్రమంలో కిష్టారం సర్పంచ్ రామకృష్ణ మరియు స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కామ్రేడ్ మంజులకు ప్రగతిశీల సంఘాల నాయకుల నివాళులు

టేకులపల్లి, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి):
ప్రగతిశీల విద్యార్థి సంఘం (పిడిఎస్‌యూ) మాజీ రాష్ట్ర నాయకురాలు, ప్రగతిశీల మహిళా సంఘం జిల్లా నాయకురాలు, సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ కొత్తగూడెం పట్టణ కమిటీ నాయకురాలు కామ్రేడ్ మంజుల అకాల మరణం పట్ల పలువురు నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. మంగళవారం కొత్తగూడెంలోని ఐఎఫ్‌టీయూ కార్యాలయంలో మంజుల భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఆమె కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రగతిశీల మహిళా సంఘం (పీఓడబ్ల్యూ) జిల్లా గౌరవ అధ్యక్షురాలు నోముల కళావతి, ప్రగతిశీల యువజన సంఘం (పీవైఎల్) రాష్ట్ర సహాయ కార్యదర్శి నోముల భానుచందర్ పాల్గొన్నారు.



గిరిజనుల హక్కుల సాధనే ఆధార్ పార్టీ లక్ష్యం

మణుగూరు, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి)
బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు కేటాయించిన సంక్షేమ నిధులను పూర్తిస్థాయిలో ఆయా వర్గాల అభివృద్ధికే ఖర్చు చేయాలని ఆధార్ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు డా. ఈడా శేషగిరిరావు డిమాండ్ చేశారు. మంగళవారం మణుగూరు మండల కేంద్రంలో కల్తీ రమేష్ అధ్యక్షతన నిర్వహించిన పినపాక నియోజకవర్గ పార్టీ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, రాజకీయ ప్రాతినిధ్యం కోసం పార్టీ కార్యకర్తలు ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని పిలుపునిచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని తెలిపారు. 2028 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలోని 119 స్థానాల్లో పోటీ చేస్తామని, త్వరలో జరగనున్న పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లోనూ బరిలోకి దిగేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. ఈ సమావేశంలో పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబోజి బుడయ్య, ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు అల్లెం వెంకటేశ్వర్లు, ఎస్సీ సెల్ అధ్యక్షుడు బండ రాజారామ్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నిబద్ధత, సేవాభావం కలిగిన ప్రజా గొంతుక మంజుల


సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు
కొత్తగూడెం, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి)
మంజుల నిబద్ధత, సేవాభావం కలిగిన ప్రజా గొంతుకని, ఆమె మృత బాధాకరమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు పేర్కొన్నారు. సిపిఐ (ఎమ్మెల్) న్యూ డెమోక్రసీ పట్టణ నాయకురాలు, జర్నలిస్టు మంజుల అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలుసుకున్న ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తూ ఒక ప్రకటనలో సంతాపం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పీడీఎస్యూలో సుదీర్ఘకాలం పనిచేసి విద్యార్థి సమస్యలపై అలుపెరగని పోరాటాలు చేసిన నిబద్ధత గల వ్యక్తి మంజుల అని కొనియాడారు. ప్రజా ఉద్యమ నేతగా ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలిచి గళమెత్తారని గుర్తుచేసుకున్నారు. ఆమె భర్త, జర్నలిస్టు జంపన్నకు, కుమారుడికి, కుటుంబ సభ్యులకు ఈ సందర్భంగా ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.



ప్రజా సమస్యలపై నిలిచిన పోరాట యోధురాలు మంజుల

సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా

కొత్తగూడెం, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి)
నిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం తపించిన మంచి నాయకురాలు మంజుల అని సిపిఐ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ఎస్ కె సాబీర్ పాషా పేర్కొన్నారు. విద్యా రంగంలోని సమస్యలతో పాటు ప్రజాసమస్యలపై, తెలంగాణ ఉద్యమ సమయంలోను అనేక పోరాటాలు చేస్తూ ప్రజల గొంతుకగా నిలిచారని, ఆమె లేని లోటు ప్రజా ఉద్యమ రంగానికి పూడ్చలేనిదని ఆవేదన వ్యక్తం చేశారు. వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ప్రసాదించాలని కోరుతూ ప్రగాఢ సానుభూతిని ప్రకటించారు.



ఖమ్మం న్యూ బస్టాండ్ వద్ద గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

ఖమ్మం నగరంలోని న్యూ బస్టాండ్ ఎదురుగా గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన వెలుగులోకి వచ్చింది. అక్టోబర్ 11న ఉదయం సుమారు 7 గంటల సమయంలో న్యూ బస్టాండ్ ఎదురుగా ఉన్న బాజీ హోటల్ పక్కన ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడి వయస్సు సుమారు 40 నుంచి 50 సంవత్సరాల మధ్య ఉంటుందని, ఎత్తు సుమారు 5.5 అడుగులు ఉంటుందని తెలిపారు. మృతుడు బట్టతలతో, నలుపు వర్ణం కలిగి ఉన్నట్లు వెల్లడించారు. మృతుడి పేరు, చిరునామా, ఇతర వివరాలు ఇప్పటివరకు తెలియరాలేదు. అతడు ఎక్కడి నుంచి వచ్చాడు, ఏ పరిస్థితుల్లో మృతి చెందాడనే విషయాలు పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. మృతదేహాన్ని గుర్తింపు, తదుపరి వైద్యపరమైన చర్యల నిమిత్తం ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి (జీజీహెచ్)కు తరలించి భద్రప రిచారు. మృతుడి గుర్తింపునకు సంబంధించిన సమాచారం సేకరించేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. మృతుడి వివరాలు తెలిసినవారు లేదా అతడిని గుర్తుపట్టినవారు వెంటనే ఖమ్మం టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు కోరారు.

భక్తిశ్రద్ధలతో నవరాత్రి ఉత్సవాలు

దుర్గామాత కమిటీ ఆధ్వర్యంలో బస్టాండ్ సెంటర్‌లో అన్నదానం ప్రారంభం



టేకులపల్లి, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి)
దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని టేకులపల్లి బస్టాండ్ సెంటర్‌లో దుర్గామాత కమిటీ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని బోడ బాలు నాయక్--జ్యోతి దంపతులు ప్రారంభించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, భక్తిశ్రద్ధలతో అన్నదాన కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు అన్నదానం చేయడం పవిత్రమైన సేవ అని నిర్వాహకులు పేర్కొన్నారు. అన్నదానం ద్వారా సేవాభావం, మానవత్వం, సామాజిక ఐక్యత పెంపొందుతాయని తెలిపారు. దుర్గా మాత ఆశీస్సులతో ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని ఆకాంక్షించారు. నవరాత్రి ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో జాలరి అప్పారావు, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాముకాటుతో వివాహిత దుర్మరణం

తల్లిని కోల్పోయిన ముగ్గురు చిన్నారులు

తల్లాడ, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి)
పత్తి తీసేందుకు పొలానికి వెళ్లిన వివాహిత పాము కాటుకు గురై మృతి చెందిన విషాద ఘటన తల్లాడ మండలం తెలగవరం గ్రామంలో మంగళవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన తేల్లూరి వాణి (30) పాము కాటుకు గురికావడంతో కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందింది. వాణికి భర్త వెంకన్నతో పాటు ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. ఆమె ఆకస్మిక మరణంతో కుటుంబంలో విషాదం నెలకొనగా, తల్లిని కోల్పోయిన చిన్నారుల పరిస్థితి గ్రామస్థులను కలచివేసింది. వ్యవసాయ పనులకు వెళ్లేవారు బూట్లు ధరించి, పొదల వద్ద జాగ్రత్తగా ఉండాలని సూచిస్తున్నారు. పాము కాటుకు గురైతే వెంటనే ఆసుపత్రికి తరలించి వైద్యం అందించాలి.



భూ రీసర్వేను పరిశీలించిన అడిషనల్ కలెక్టర్



తల్లాడ, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి)
తల్లాడ మండలం లక్ష్మీపురం గ్రామంలో జరుగుతున్న భూ రీసర్వేను జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్రీనివాసరెడ్డి మంగళవారం పరిశీలించారు. సర్వే నిర్వహణ తీరుపై తహసీల్దార్ కరుణాకర్‌రెడ్డిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. భూ రీసర్వేను పారదర్శకంగా నిర్వహించాలని, రైతుల భూముల వివరాలను క్షుణ్ణంగా పరిశీలించాలని అధికారులకు సూచించారు. మొదటి విడతలో లక్ష్మీపురం, కుర్నవల్లి, తెలగారం, బసవాపురం గ్రామాల్లో సర్వే కొనసాగుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

సీఎం రేవంత్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన నారపోగు వెంకటేశ్వర్లు



తల్లాడ, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి)
ఢిల్లీలో తెలంగాణ ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డిని టీపీసీసీ ఎస్సీ విభాగం రాష్ట్ర వైస్ చైర్మన్ నారపోగు వెంకటేశ్వర్లు కలిసి ధన్యవాదాలు తెలిపారు. ఢిల్లీలో ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ రాజీనామా చేయాలని చేపట్టిన నిరసన కార్యక్రమం విజయవంతమైన నేపథ్యంలో సీఎంను కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, మానకొండూరు ఎమ్మెల్యే, రాష్ట్ర ఎస్సీ విభాగం చైర్మన్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఖమ్మం జిల్లా డీసీసీ అధ్యక్షుడు నూతి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక

ప్రకృతి పండుగ బతుకమ్మ.. చైతన్య కళాశాలలో సంబరాలు



తిమ్మాపూర్, అక్టోబర్ 13(తెలంగాణ వాణి ప్రతినిధి)

తిమ్మాపూర్ మండలంలోని శ్రీ చైతన్య ఫార్మసీ కళాశాలలో మంగళవారం బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించారు. కళాశాల చైర్మన్ ముద్దసాని.రమేష్ రెడ్డి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. ప్రకృతిని ఆరాధించే గొప్ప సంస్కృతి తెలంగాణ ప్రజల సొంతమని ఆయన పేర్కొన్నారు. విద్యార్థినులు బతుకమ్మ పాటలతో సందడి చేశారు. కళాశాల డైరెక్టర్ కె. నరేందర్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి వేడుకలు కుటుంబ, సామాజిక ఐక్యతను పెంపొందిస్తాయని అన్నారు. ప్రిన్సిపాల్ డా. ఎ. రామనరసింహారెడ్డి బతుకమ్మ పండుగ విశిష్టతను వివరించారు. కార్యక్రమంలో ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డా. ఎ. ప్రసాద్ రాజు, విభాగాధిపతులు డా. ఎం. రవీందర్, డా. చంద్ర మౌళి, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జమ్లా తాండ భూమి విక్రయంపై ఆరోపణల్లో వాస్తవం లేదు

మా భూమిని మేమే విక్రయించాం.. ఆధారాలుంటే చూపించండి

సిర్గాపూర్: అక్టోబర్ 13 (తెలంగాణ వాణి ప్రతినిధి)



సిర్గాపూర్: మండల పరిధిలోని జమ్లా తాండలో భూమి విక్రయానికి సంబంధించి సోషల్ మీడియాలో వచ్చిన ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని భూమి విక్రయించినట్లు పేర్కొంటున్న సంబంధిత వ్యక్తులు తెలిపారు. జమ్లా తాండ పరిధిలోని సర్వే నంబర్లు 199, 220, 221, 233లో ఉన్న మొత్తం 21 ఎకరాల భూమి అబ్దుల్ రషీద్ తండ్రి జానేమియా కుటుంబానికి చెందిన ఎనిమిది మంది అన్నదమ్ముల పేర్లపై ఉందని వివరించారు.తమ అవసరాల నిమిత్తం సుశీల, రమేష్ చవాన్‌తో పాటు వారికి సన్నిహితులైన మరో ఏడుగురికి భూమిని తామే విక్రయించినట్లు వారు వెల్లడించారు. ఈ భూమి విక్రయంపై తాండకు చెందిన తుకారం, సర్పంచ్, విశ్వనాథ్ సోషల్ మీడియా ద్వారా చేసిన వ్యాఖ్యలు, ఆరోపణల్లో వాస్తవం లేదని ఖండించారు.భూమిని తామే స్వయంగా విక్రయించామని, దీనికి సంబంధించిన ఆధారాలు ఏవైనా ఉంటే చూపించాలని వారు పేర్కొన్నారు. భూమి విక్రయానికి సంబంధించి తమ వద్ద ఉన్న వివరాలు, ఆధారాల ప్రకారం తాము సమాధానం చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు.

పి.ఆర్.టి.యు.టి.ఎస్. రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను విజయవంతం చేయండి

రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కుంభాల శ్రీనివాస్ రెడ్డి పిలుపు


రాయికల్, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి)



ఈ నెల 15, 16 తేదీల్లో నల్గొండ జిల్లా గంధంవారిగూడెం రోడ్డులోని జి.ఎం. గార్డెన్‌లో నిర్వహిం చనున్న పి.ఆర్.టి.యు.టి.ఎస్. ఆరో రాష్ట్ర కౌన్సిల్ సమావేశాలను ఉపాధ్యాయులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు కుంభాల శ్రీనివాస్ రెడ్డి పిలుపు నిచ్చారు. ఈ సమావేశాల్లో 2026--28 సంవత్స రాలకు నూతన రాష్ట్ర కార్యవర్గ ఎన్నికలతో పాటు పీఆర్సీ, పెండింగ్ డీఏలు, రిటైర్మెంట్ బకాయిలు, ఆరోగ్య పథకం అమలు, సీపీఎస్ రద్దు, సర్వీస్ రూల్స్ తదితర సమస్యలపై తీర్మానాలు చేసి, భవిష్యత్ ఉద్యమ కార్యాచరణ రూపొందిం చనున్నట్లు తెలిపారు. 70 వేల మంది సభ్యుల బలం కలిగిన సంఘం ఐక్యతను చాటుతూ, ఉపాధ్యాయ, ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సమావేశాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఉద్యమకారుల ఫోరం బలోపేతానికి నూతన కమిటీలు

వివిధ గ్రామ శాఖలకు బాధ్యుల నియామకం



ఇల్లందకుంట, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి ప్రతినిధి)

కరీంనగర్ జిల్లా ఇల్లందకుంట మండలంలో ఉద్యమకారుల ఫోరం బలోపేతం కోసం నూతన కమిటీలను ఏర్పాటు చేశారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, జిల్లా అధ్యక్షుడు ఎక్కటి సంజీవరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నూతన బాధ్యులకు నియామక పత్రాలు అందజేశారు. బోగంపాడు గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఊరడి మల్లారెడ్డి, పాతర్లపల్లి గ్రామ శాఖ అధ్యక్షుడిగా అబ్బిడి శ్రీపాల్ రెడ్డి, ఇల్లందకుంట మండల ఉపాధ్యక్షుడిగా గడ్డి రాములును నియమించారు. ఉద్యమకారుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ, సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని నూతన బాధ్యులకు నాయకులు సూచించారు. గ్రామస్థాయి నుంచి ఫోరాన్ని బలోపేతం చేస్తూ ఉద్యమకారులందరినీ సమన్వయం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో హుజూరాబాద్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆరే రమేష్ రెడ్డి, సర్పంచ్ గడ్డి శ్రీనివాస్, మండల అధ్యక్షుడు రావుల రాజబాబు, వర్కింగ్ ప్రెసిడెంట్ నర్ర భూమిరెడ్డి, మహిళా అధ్యక్షురాలు మంకలి రమ, జోడు సంపత్, కొడారి అయ్యప్ప, కోడెం భిక్షపతి, కుంట చంద్రారెడ్డి, ఊరడి రాజిరెడ్డి, శీలం రవి, నర్ర తిరుపతి రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అగ్నిప్రమాద బాధిత కుటుంబానికి మద్దుల గోపాల్ రెడ్డి ఆర్థిక సాయం

కొమురయ్య కుటుంబానికి అండగా ఉంటామని భరోసా

ఎండపల్లి, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి)



ఎండపల్లి మండల కేంద్రంలో ఇటీవల జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన దాసరి కొమురయ్య కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మద్దుల గోపాల్ రెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబానికి రూ. 10 వేల ఆర్థిక సాయం అందించి మనోధైర్యం కల్పించారు. రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ సహకారంతో బాధిత కుటుంబానికి ప్రభుత్వపరంగా అండగా ఉంటామని, ఇందిరమ్మ ఇల్లు మంజూరుకు కృషి చేయడంతో పాటు ఇంటి నిర్మాణానికి తన వంతు సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ గూడ రాంరెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు గెల్లు చంద్రశేఖర్, ప్రధాన కార్యదర్శి కందికట్ల రాజేష్, సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు సంగ రమేష్ తదితరులు పాల్గొన్నారు.

తిమ్మాపూర్ చౌరస్తాలో లారీల రాంగ్ రూట్ ప్రయాణం

అధిక లోడుతో గ్రానైట్ రవాణా..

ప్రమాదాలపై స్థానికుల ఆందోళన

తిమ్మాపూర్, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి ప్రతినిధి)



తిమ్మాపూర్ మండలంలో గ్రానైట్ లారీల రవాణా తీరుపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధిక లోడుతో పాటు రాంగ్ రూట్‌లో భారీ వాహనాలు రాకపోకలు సాగిస్తుండటంతో ప్రమాదాల ముప్పు పొంచి ఉందని వాపోతున్నారు. పోరండ్ల గ్రామ శివారులోని గ్రానైట్ క్వారీ నుంచి తిమ్మాపూర్ సమీపంలోని ఓ రైస్ మిల్ వద్దకు టిఎస్ 02 యుఏ 2772 నంబరు గల లారీలో భారీ గ్రానైట్ బండరాళ్లను తరలిస్తున్నట్లు స్థానికులు పేర్కొంటున్నారు. రద్దీగా ఉండే తిమ్మాపూర్ చౌరస్తాలో లారీలు రాంగ్ రూట్‌లో వెళు ్తండటంపై వాహనదారులు, ప్రయాణికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. గతంలో ఈ చౌరస్తా వద్ద పలు రోడ్డు ప్రమాదాలు చోటుచేసుకున్నాయని, ఇలాంటి పరిస్థితులు పునరావృతం కాకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు. భారీ వాహనాల రాకపోకలతో గ్రామీణ రహదారులు దెబ్బతింటున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గ్రానైట్ రవాణాకు సంబంధించి అనుమ తులు, పర్మిట్లు, లోడ్ పరిమితులపై సంబంధిత అధికా రులు తనిఖీలు నిర్వహించాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. నిబంధనలు ఉల్లంఘించే వాహనాలపై చర్యలు తీసుకోవడంతో పాటు తిమ్మాపూర్ చౌరస్తాలో ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



మారుపాక వినోద్‌కు మరణం లేదు.. సేవల రూపంలో చిరంజీవి!

- మిత్రుల ఆపన్నహస్తం.. వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకుల పంపిణీ
- వినోద్ జ్ఞాపకార్థం సేవా కార్యక్రమాలు నిర్వహించాలని ఆత్మీయుల సంకల్పం

కోరుట్ల రూరల్, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి)



రోడ్డు ప్రమాదం రూపంలో మృత్యువు కబళించినా.. నిరుపేదలకు అందించే సేవల రూపంలో మారుపాక వినోద్‌ను చిరంజీవిగా నిలపాలని ఆయన ఆత్మీయ మిత్రులు సంకల్పించారు. కోరుట్ల పట్టణానికి చెందిన వినోద్ గత ఏడాది రోడ్డు ప్రమాదంలో అకాల మరణం చెందగా, ఆయన ప్రథమ వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం ఇటిక్యాల వృద్ధాశ్రమంలో నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. వినోద్ జ్ఞాపకాలను పదిలం చేసుకోవడంతో పాటు, ఆయన పేరుతో ట్రస్ట్ ఏర్పాటు చేసి ప్రతి ఏటా సేవా కార్యక్రమాలు నిర్వహించాలని మిత్రులు నిర్ణయించారు. వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడంతో పాటు అనాథలకు, వృద్ధాశ్రమాలకు చేయూత అందించాలని సంకల్పించారు. ఈ క్రమంలో వినోద్ ప్రథమ వర్ధంతి సందర్భంగా వృద్ధాశ్రమానికి నిత్యావసర సరుకులు అందించి తమ మిత్రుడిపై ఉన్న అభిమానాన్ని చాటుకున్నారు. ఆప్తమిత్రుడిని కోల్పోయిన బాధను దిగమింగుకుంటూనే, ఆయన పేరుతో నిరుపేదలకు సేవ చేయాలనే మిత్రుల ఆలోచన పలువురి ప్రశంసలు అందుకుంది. తమ మధ్య వినోద్ లేకపోయినా, ఆయన ఆశయాలను సేవా కార్యక్రమాల ద్వారా కొనసాగిస్తామని మిత్రులు పేర్కొన్నారు. మనిషి మరణించినా.. మానవత్వంతో చేసే సేవలు చిరస్థాయిగా నిలుస్తాయనే సందేశాన్ని మారుపాక వినోద్ మిత్రులు చాటిచెప్పారు.

వలువోజు సుదర్శన్ చారి ఆశయాలను సాధిస్తాం

మాజీ ఎమ్మెల్యే చాడ వెంకటరెడ్డి

హుస్నాబాద్, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి ఆర్‌సీ)



భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ)లో గ్రామస్థాయి కార్యకర్త నుంచి మండల, జిల్లా స్థాయి నాయకుడిగా ఎదిగిన వలువోజు సుదర్శన్ చారి మరణం పార్టీకి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే, సీపీఐ నాయకుడు చాడ వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం హుస్నాబాద్ మండలం పొట్లపల్లి గ్రామంలో సుదర్శన్ చారి కుటుంబ సభ్యులను పరామర్శించి, వారికి ధైర్యం చెప్పారు. ఈ సందర్భంగా సుదర్శన్ చారి భార్య భాగ్యలక్ష్మి, కుమారులు సర్వేశ్వర చారి, పరమేశ్వర చారి, సతీశ్వర చారి, కుటుంబ సభ్యులు ప్రియాంక, తన్మయిలను ఓదార్చారు. సుదర్శన్ చారి ప్రజా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని పార్టీకి విశేష సేవలందించారని గుర్తుచేశారు. ఆయన ఆశయాల సాధనకు కృషి చేస్తామని, బాధిత కుటుంబానికి సీపీఐ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. అనంతరం పొట్లపల్లిలో అనారోగ్యంతో బాధపడుతున్న సీపీఐ సీనియర్ నాయకుడు బొనగిరి ఎల్లయ్యను ఆయన నివాసంలో పరామర్శించారు. హుస్నాబాద్ పట్టణంలోని ఏడో వార్డుకు చెందిన బైరి వీరయ్య కుమారుడు నరసింహ రోడ్డు ప్రమాదంలో మృతి చెందడంతో బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. తొమ్మిదో వార్డుకు చెందిన చెన్నవేని బాలవ్వ, చెన్నవేని మంజుల కుటుంబాలను, అక్కన్నపేట మండలం తెనుగుపల్లికి చెందిన మాజీ సర్పంచ్ బోడిగె కొమురయ్య, బైరి లింగయ్యలను పరామర్శించి వారి ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ హుస్నాబాద్ నియోజకవర్గ కన్వీనర్ జాగీర్ సత్యనారాయణ, సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి హుస్నాబాద్ మాజీ వైస్ ఎంపిపి గడిపె మల్లేశ్, భారత జాతీయ మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు గూడ పద్మ, సిపిఐ మండల సహాయ కార్యదర్శి పొదిల కుమారస్వామి, సిపిఐ సినీయర్ నాయకులు మాజీ సర్పంచ్ కొయడ కొమురయ్య, గౌరవెల్లి ఉప సర్పంచ్ మాచర్ల శ్రీనివాస్, సిపిఐ నాయకులు గాంభీరపు మధు, కొమ్ముల పర్శరాం,మంద శ్రీనివాస్,బైరి శ్రీనివాస్,బొడిగె సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.



చిన్నారి భవిష్యత్తుకు భరోసా.. అఖిల--విక్రమ్ దంపతుల ఔదార్యం

రోడ్డు ప్రమాదంలో తండ్రిని కోల్పోయిన చిన్నారికి రూ.20 వేల డిపాజిట్

జమ్మికుంట, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి ప్రతినిధి)

రోడ్డు ప్రమాదంలో తండ్రిని కోల్పోయిన చిన్నారి భవిష్యత్తుకు ఆర్థిక భరోసా కల్పించి పల్లె అఖిల--విక్రమ్ దంపతులు మానవత్వాన్ని చాటుకున్నారు. జమ్మికుంట మండలం కోరపల్లి గ్రామానికి చెందిన గిరవేణ శ్యామ్ ఇటీవల జమ్మికుంట పట్టణంలోని ఎఫ్‌సీఐ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి, చికిత్స పొందుతూ మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న పల్లె లవకుమార్ కుమార్తె, అల్లుడు అఖిల--విక్రమ్ దంపతులు బాధిత కుటుంబానికి అండగా నిలవాలని నిర్ణయించుకున్నారు. ఇందులో భాగంగా శ్యామ్ పెద్ద కుమార్తె గిరవేణ సంయుక్త పేరు మీద రూ. 20 వేల నగదును పోస్టాఫీసులో డిపాజిట్ చేశారు. తండ్రిని కోల్పోయిన చిన్నారి భవిష్యత్తులో చదువు, ఇతర అవసరాలకు ఈ మొత్తం ఉపయోగపడాలనే ఉద్దేశంతో దంపతులు ఈ సాయం అంది ంచారు. కష్టకాలంలో ఉన్న కుటుంబానికి అండగా నిలవడంతో పాటు చిన్నారి భవిష్యత్తు గురించి ఆలోచించిన అఖిల--విక్రమ్ దంపతుల ఔదార్యాన్ని గ్రామస్థులు అభినందించారు. వారి సేవాభావం పలువురికి స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు.

సబ్సిడీ వేరుశనగ విత్తనాలు పక్కదారి పడుతున్నాయా

- విత్తనాల పంపిణీపై సమగ్ర విచారణ జరపాలి
- బీజేవైఎం నాయకుడు కర్ణకంటి నరేష్ డిమాండ్

హుస్నాబాద్, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి ఆర్‌సీ)

సబ్సిడీ వేరుశనగ విత్తనాలు పొందిన లబ్ధిదారుల జాబితాను బహిర్గతం చేయడంతో పాటు, పంపిణీ వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించాలని బీజేవైఎం నాయకుడు కర్ణకంటి నరేష్ డిమాండ్ చేశారు. సిద్దిపేట జిల్లా అక్కన్నపేట మండల కేంద్రంలో ఆయన మాట్లాడుతూ, అర్హులైన రైతులకు అందా ల్సిన సబ్సిడీ విత్తనాలు పక్కదారి పడుతున్నాయని ఆరోపిం చారు. కొంతమంది విత్తనాలను వ్యవసాయానికి వినియోగించకుండా ఇతర అవసరాలకు మళ్లిస్తున్నారని, మరికొందరు బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తున్నారని పేర్కొన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు నిర్వహించి, విత్తనాలు పొందిన రైతుల వివరాలు, వారు తీసుకున్న బ్యాగుల సంఖ్య, సాగు చేస్తున్న భూమి విస్తీర్ణంపై పరిశీలన జరపాలని కోరారు. అనర్హులకు విత్తనాలు కేటాయించినట్లు తేలితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అర్హులైన రైతులకు సకాలంలో సబ్సిడీ విత్తనాలు అందేలా చర్యలు చేపట్టాలని, ఈ అంశంపై జిల్లా కలెక్టర్‌కు రైతులతో కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. రైతులకు న్యాయం జరిగే వరకు ఆందోళన కార్యక్రమాలు చేపడతామని నరేష్ హెచ్చరించారు.

నాగిరెడ్డిపేటలో సైబర్ నేరాలపై పోలీసుల అవగాహన

సైబర్ మోసాలు, మాదకద్రవ్యాలు, రోడ్డు ప్రమాదాల నివారణపై సూచనలు



నాగిరెడ్డిపేట, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి ప్రతినిధి)

సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కళాబృందం ఇన్‌ఛార్జ్ హెడ్ కానిస్టేబుళ్లు రామంచ తిరుపతి, శేషారావు సూచించారు. జిల్లా ఎస్పీ రాజేష్ చంద్ర ఆదేశాల మేరకు, ఎస్సై భార్గవ్ గౌడ్ సూచనలతో హెడ్ కానిస్టేబుల్ మదన్ ఆధ్వర్యంలో మంగళవారం నాగిరెడ్డిపేటలోని యూనియన్ బ్యాంకు, బస్టాండ్ వద్ద అవగాహన కార్యక్రమం నిర్వహించారు. గుర్తుతెలియని వ్యక్తులకు ఓటీపీలు, బ్యాంకు వివరాలు వెల్లడించవద్దని, సైబర్ మోసానికి గురైతే వెంటనే 1930 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని, మైనర్లు వాహనాలు నడపవద్దని, మద్యం సేవించి వాహనాలు నడపకూడదని తెలిపారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సూచించారు. మహిళలు, బాలికలపై వేధింపులు జరిగితే షీ టీమ్ నంబర్ 8712686094ను సంప్రదించాలని, ఫిర్యాదుదారుల వివరాలు గోప్యంగా ఉంచుతామని పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుళ్లు రామంచ తిరుపతి, వై. శేషారావు, కానిస్టేబుళ్లు సాయిలు, ప్రభాకర్, యూనియన్ బ్యాంక్ మేనేజర్ పవన్, బ్యాంక్ సిబ్బంది, నాగిరెడ్డిపేట హెడ్ కానిస్టేబుల్ ఎం. మదన్, బ్లూ కోట్స్ పీసీ దక్షిణామూర్తి, హెచ్ జీ సాయి కుమార్, ఎల్లారెడ్డి షీ టీమ్ పీసీ శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.

పొనుగోటి శ్రీనివాస్ రావు జన్మదినం సందర్భంగా ప్రత్యేక పూజలు

అమ్మవారికి అర్చన.. భవానీ స్వాములకు అన్నదానం



ఎండపల్లి, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి)

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు గెల్లు చంద్రశేఖర్ తన అభిమాన నాయకుడు, ప్రజాసేవకుడు పొనుగోటి శ్రీనివాస్ రావు (బాపు) జన్మదినాన్ని పురస్కరించుకుని రాజారంపల్లి గ్రామంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి ఉత్సవ సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ రావు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో నిండు నూరేళ్లు జీవించాలని ఆకాంక్షిస్తూ ప్రత్యేక అర్చన చేశారు. అనంతరం భవానీ స్వాములకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ప్రజాసేవలో మరింత ముందుకు సాగుతూ పేదలకు అండగా నిలవాలని శ్రీనివాస్ రావును ఆకాంక్షిస్తూ గెల్లు చంద్రశేఖర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఉత్సవ సమితి నిర్వాహకులు, అమ్మవారి భక్తులు, పీఎస్ఆర్ అభిమానులు పాల్గొన్నారు.

సద్దుల బతుకమ్మకు సౌకర్యాలు కల్పించిన సర్పంచ్

ఆడపడుచులకు ఇబ్బందులు కలగకుండా ప్రత్యేక చర్యలు



జగిత్యాల/బుగ్గారం, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి)

జగిత్యాల జిల్లా బుగ్గారం మండలం యశ్వంతరావుపేట గ్రామంలో సద్దుల బతుకమ్మ వేడుకల సందర్భంగా మహిళలకు ఇబ్బందులు కలగకుండా సర్పంచ్ ఉరుమట్ల లక్ష్మి బుచ్చయ్య ప్రత్యేక సౌకర్యాలు కల్పించారు. గతంలో బతుకమ్మల నిమజ్జనం సమయంలో ఎదురైన ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని, గ్రామ ఆడపడుచులకు అనుకూలంగా ఏర్పాట్లు చేశారు. పండుగను సంతోషంగా జరుపుకునేందుకు అవసరమైన సదుపాయాల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. గ్రామ ప్రజల సౌకర్యం, సంక్షేమమే లక్ష్యంగా అభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తున్నట్లు తెలిపారు.

ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బతుకమ్మ సంబరాలు




రాజపేట అక్టోబర్: 13(తెలంగాణ వాని విలేకరి)

రాజపేట మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ మోసెస్ రాజ్ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు మంగళవారం రోజున నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ చందన విజయ రాణి భీకు నాయక్ విజయలక్ష్మి ల్యాబ్ టెక్నీషియన్ సౌజన్య జూనియర్ అసిస్టెంట్ సత్యనారాయణ సిస్టర్స్ ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక

ఘనంగా దొమ్మాటి కిరణ్ కుమార్ జన్మదిన వేడుకలు



మేడ్చల్ జిల్లా, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి)

తెలంగాణ జేఏసీ మాజీ కన్వీనర్, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర మీడియా కన్వీనర్, సీనియర్ పాత్రికేయులు దొమ్మాటి కిరణ్ కుమార్ రావు జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ప్రొఫెసర్ ఎం. కోదండరాం ఆయనను సన్మానించి, స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఉద్యమంలో కిరణ్ కుమార్ చురుగ్గా పాల్గొన్నారని కోదండరాం గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు కీర్తి శ్రీనివాస్, దాసారం శ్రీనివాస్, వెంకటాపురం రవి, ఇడుపాక సురేష్, నర్రా శ్రీనివాస్ రెడ్డి, టీపీసీసీ ఓబీసీ రాష్ట్ర కన్వీనర్ గరిక సుధాకర్, ఎరువ అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిలిం పోటీలకు యువతకు ఆహ్వానం

జగిత్యాల, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి ప్రతినిధి)



పోలీస్ ఫ్లాగ్ డే సందర్భంగా జగిత్యాల జిల్లా యువత, ఔత్సాహిక ఫోటోగ్రాఫర్లకు ఫోటోగ్రఫీ, షార్ట్ ఫిలిం పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్ తెలిపారు. పోలీసుల త్యాగాలు, సేవలు, విధి నిర్వహణను ప్రతిబింబించేలా ఫోటోలు, షార్ట్ ఫిలింలు రూపొందించాలని సూచించారు. ఆసక్తి గల వారు పోలీసులకు సంబంధించిన మూడు ఫోటోలు (10ఐ8 అంగుళాల సైజులో), మూడు నిమిషాలకు మించని షార్ట్ ఫిలింను పెన్‌డ్రైవ్‌లో తమ వివరాలతో ఈ నెల 23వ తేదీ సాయంత్రంలోగా సమీప పోలీస్ స్టేషన్‌లో అందజేయాలని కోరారు. జిల్లా స్థాయిలో ఎంపికైన మూడు ఫోటోలు, మూడు షార్ట్ ఫిలింలను రాష్ట్రస్థాయి పోటీలకు పంపనున్నట్లు ఎస్పీ తెలిపారు.

రైతుల కష్టాలు గుర్తించి పంటలకు నీరందించేలా చర్యలు

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



బుగ్గారం, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి విలేకరి)

రైతుల ఇబ్బందులను గుర్తించి పంట పొలాలకు నీరందించేందుకు ఎస్సారెస్పీ నుంచి నీటిని విడుదల చేస్తున్నట్లు మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. ఎస్సారెస్పీ ప్రాజెక్టులో నీటిమట్టం తక్కువగా ఉన్నప్పటికీ ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు, సంబంధిత వ్యవసాయ అధికారులతో సమన్వయం చేసుకుని రైతులకు సాగునీరు అందించేలా చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. దసరా, బతుకమ్మ పండుగల సమయంలో నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రైతులకు అండగా నిలవడమే ప్రజాపాలన ప్రభుత్వ లక్ష్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

అభిమానుల కోలాహలం మధ్య పొనుగోటి జన్మదిన వేడుకలు

కోటిలింగాలలో ఆయురారోగ్యాల కోసం ప్రత్యేక పూజలు

జగిత్యాల/వెల్గటూర్, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి ప్రతినిధి)



తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ నాయకుడు, వెల్గటూర్ మాజీ ఎంపీపీ పొనుగోటి శ్రీనివాస్ రావు (పీఎస్ఆర్) జన్మదిన వేడుకలను అభిమానులు, అనుచరులు, కాంగ్రెస్ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. వెల్గటూర్‌లో అంబేద్కర్ విగ్రహం వద్ద టీయూడబ్ల్యూజే (ఐజేయూ) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు, ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు నక్క లక్ష్మణ్ యాదవ్ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. కోటిలింగాలలోని శ్రీ కోటేశ్వర స్వామి ఆలయంలో ఆయన ఆయురారోగ్యాల కోసం ప్రత్యేక పూజలు నిర్వహించి స్వీట్లు పంపిణీ చేశారు. పాశిగామ యువకుల ఆధ్వర్యంలో గమ్యం రెస్టారెంట్‌లోనూ ముందస్తు వేడుకలు నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ఉప సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు గండ్ర ప్రతాప్ రావు, సర్పంచ్‌లు భూపెల్లి రాజయ్య, దొరిశెట్టి మల్లేశం, బొడ్డు రామస్వామి, బండెల ఉదయ్ గౌడ్, రాంధేని కోటయ్య, బోడకుంటి రమేష్, దావుల లక్ష్మణ్, బండమీది గోపి, మెరుగు నరేష్, గాజుల రవి, యాగండ్ల గంగయ్య, రేగొండ శ్రీనివాస్, జక్కుల సత్యనారాయణ, జైశెట్టి రామకృష్ణ, నక్క సురేష్, ముచ్చర్ల తిరుపతి, కాశం సంతోష్, గొపతి నరేష్, మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

అక్రమంగా వినియోగిస్తున్న 22 గ్యాస్ సిలిండర్లు జప్తు

వాణిజ్య అవసరాలకు గృహ సిలిండర్లు వాడితే చర్యలు





ఎండపల్లి, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి)

జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం రాజరంపల్లి గ్రామంలో పౌర సరఫరాలు, రెవెన్యూ శాఖ అధికారులు మంగళవారం సంయుక్తంగా ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిబంధనలకు విరుద్ధంగా వాణిజ్య అవసరాలకు వినియోగిస్తున్న 22 గృహ గ్యాస్ సిలిండర్లను స్వాధీనం చేసుకున్నారు. గృహ వినియోగానికి కేటాయించిన సబ్సిడీ సిలిండర్లను హోటళ్లు, టీ స్టాళ్లు, టిఫిన్ సెంటర్లు, ఇతర వ్యాపార సంస్థల్లో ఉపయోగించడం చట్టరీత్యా నేరమని అధికారులు హెచ్చరించారు. వ్యాపార సంస్థలు తప్పనిసరిగా వాణిజ్య సిలిండర్లనే వినియోగించాలని, నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఈ తనిఖీల్లో జగిత్యాల పౌర సరఫరాల శాఖ అధికారులు, స్థానిక రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

గీతంలో డిజైన్ థింకింగ్ పై ఎండీపీ మూడు రోజుల కార్యక్రమంలో సంస్థాగత సవాళ్ల పరిష్కారానికి శిక్షణ

పటాన్ చెరు, అక్టోబర్ 13, (తెలంగాణ వాణి):

గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ (జీఎస్బీ) లోని వ్యాపార భాగస్వామ్య కేంద్రం (సీబీఈ) ఆధ్వర్యంలో 'సంస్థాగత ఆవిష్కరణ కోసం డిజైన్ థింకింగ్: భవిష్యత్తుకు సిద్ధంగా ఉన్న సంస్థల కోసం మానవ-కేంద్రీకృత సమస్య పరిష్కారం' పేరిట మూడు రోజుల యాజమాన్య వికాస కార్యక్రమం (ఎండీపీ)ని నవంబరు 26 నుంచి 28వ తేదీ వరకు నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ కార్యక్రమం, డిజైన్ థింకింగ్ లోని ఐదు దశలైన- సహానుభూతి (ఎంపథైజ్), నిర్వచించడం (డిఫైన్), ఆలోచనలు చేయడం (ఐడియేట్), నమూనా తయారు చేయడం (ప్రోటోటైప్), పరీక్షించడం (టెస్ట్) ద్వారా సంస్థాగత సవాళ్లను పరిష్కరించడానికి అవసరమైన మానవ-కేంద్రీకృత విధానంతో ఇందులో పాల్గొనే వారిని సన్నద్ధం చేయడం లక్ష్యంగా పెట్టుకున్నట్లు వివరించారు. ఇందులో సహానుభూతి మ్యాపింగ్, కస్టమర్ జర్నీ మ్యాపింగ్, సమస్యను గుర్తించడం, పున:రూపకల్పన చేయడం, సృజనాత్మక ఆలోచనలు చేయడం, వేగవంతమైన నమూనా తయారీ, వినియోగదారు పరీక్ష, ఆవిష్కరణ సంస్కృతి, అంతర్గత వ్యవస్థాపకత వంటి కీలక అంశాలు ఉంటాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో క్యాప్ స్టోన్ టీమ్ ఛాలెంజ్, ఆచరణాత్మక కార్యాలయ అనువర్తనాలు కూడా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమం ముగిసేనాటికి, ఇందులో పాల్గొనేవారు డిజైన్ థింకింగ్ ను ఉపయోగించి సంస్థాగత సవాళ్లను పరిష్కరించడం, వినియోగదారు, వాటాదారుల అవసరాలను అర్థం చేసుకోవడం, వినూత్నమైన, ఆచరణాత్మక పరిష్కారాలను రూపొందించడం, నమూనాలను అభివృద్ధి చేసి పరీక్షించడం, వివిధ విభాగాల మధ్య సహకారాన్ని బలోపేతం చేయడం, సంస్థాగత ఆవిష్కరణ, మార్పును ప్రోత్సహించడం, తమ సంస్థల కోసం ఆచరణీయమైన ఆవిష్కరణ ప్రణాళికలను రూపొందించడం వంటివి చేయగలుగుతారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ లోని ఎంటర్ ప్రెన్యూర్ షిప్ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్, ఏరియా చైర్ డాక్టర్ సుభేందు కుమార్ మిశ్రా, ఆర్గనైజేషనల్ డెవలప్ మెంట్ అండ్ హెచ్ఆర్ విభాగం అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ తపస్ బంధా సమన్వయకర్తలుగా వ్యవహరిస్తారని తెలియజేశారు. ఇందులో పాల్గొనాలనే ఆసక్తి ఉన్నవారు తమ పేర్ల నమోదు, రుసుము వంటి వివరాల కోసం 96500 89575ను సంప్రదించాలని లేదా cbe@gitam.eduÅ£" ఈ-మెయిల్ చేయాలని సూచించారు.



సామూహిక కుంకుమార్చనలు

పెద్ద శంకరంపేట, అక్టోబర్ 13, (తెలంగాణ వాణి :

దేవి శరన్నవరాత్రి ఉత్సవాలలో భాగంగా పెద్ద శంకరంపేట లో ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మంటపం వద్ద, దుర్గాభవాని మందిరంలో మంగళవారం మహిళలు నిర్వహించారు. వేద బ్రాహ్మణ పండితుల మంత్రోచ్ఛారణలతో సామూహికంగా అధిక సంఖ్యలో మహిళలు కుంకుమార్చన కార్యక్రమం లో పాల్గొన్నారు. గడి కోటలో, మాధవ నగర్ కాలనీలో, ఆర్య వైశ్య సంఘం ఆధ్వర్యంలో గంగపుత్ర యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన దుర్గామాత మండపాలలో అన్నపూర్ణ దేవిగా ప్రత్యేకంగా అమ్మ వారిని అలంకరించి భక్తులు ఉదయం సాయంత్రం ప్రత్యేక పూజ కార్యక్రమాలు చేశారు.

ఘనంగా సిరికొండ జన్మదిన వేడుకలు

చౌరస్తాలో కేక్ కట్

ఆసుపత్రిలో రోగులకు పండ్ల పంపిణీ



చిట్యాల, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి ప్రతినిధి)

తెలంగాణ తొలి శాసనసభాపతి, ఎమ్మెల్సీ, శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి జన్మదిన వేడుకలను మంగళవారం చిట్యాల మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. బీఆర్ఎస్ జిల్లా నాయకుడు చింతల రమేష్ ముదిరాజ్ ఆధ్వర్యంలో చౌరస్తాలో కేక్ కట్ చేసి, నినాదాలతో సందడి చేశారు. అనంతరం స్థానిక ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా చింతల రమేష్ ముదిరాజ్, మండల యూత్ కమిటీ మాజీ అధ్యక్షుడు జన్నె యుగంధర్ మాట్లాడుతూ భూపాలపల్లి జిల్లా ఏర్పాటు, చిట్యాలలో 50 పడకల ఆసుపత్రి, జిల్లా కేంద్రంలో 100 పడకల ఆసుపత్రి ఏర్పాటు తదితర అభివృద్ధి పనుల్లో మధుసూదనాచారి కృషి కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు కన్నెబోయిన అశోక్, కొత్త శ్రీను, యువ నాయకులు గుర్రం సుశ్రుత్, జెంబుల చంద్రమౌళి, సంగ రాజేందర్, ఎండీ శంషుద్దీన్, ఎజ్జిగిరి ఆనందం, గురుకుంట్ల కిరణ్, ఉప్పుల కిరణ్, రాయిని శ్రీకాంత్, నల్ల నవీన్, తీగల బాలకృష్ణ, ఆనందాచారి, మోతుకూరి సంతోష్, వేముల హరీష్, భయగాని గణపతి, బొట్ల రవి, బొంకూరి సమ్మయ్య, రాజయ్య, ఆర్ఎంపీ భాస్కర్, మందల రాజేష్, బండి తిరుపతి, గుర్రం విజేందర్, కోడెల రాజమల్లు, రాజు నాయక్, మల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

గ్యాస్ సిలిండర్ పేలి ముగ్గురికి తీవ్ర గాయాలు


బాధిత కుటుంబాన్ని పరామర్శించిన వాకిటి శ్రీధర్



వనపర్తి, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి ప్రతినిధి)

వనపర్తి మున్సిపాలిటీ పరిధిలోని 30వ వార్డులో వెంకటాచారి ఇంట్లో భారత్ గ్యాస్ సిలిండర్ పేలడంతో ముగ్గురు తీవ్రంగా గాయపడ్డారు. వారిలో ఇద్దరిని మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్ ఆసుపత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న జిల్లా అధికార ప్రతినిధి, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ వాకిటి శ్రీధర్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. ప్రమాదంలో ధ్వంసమైన ఇంటికి, ఫర్నిచర్‌కు తగిన నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం చేయకపోతే భారత్ గ్యాస్ సంస్థ ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వంశీకృష్ణ, కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

మంచినీటి బోరుకు వెళ్లే దారిలో నెట్‌వర్క్ వైరు అడ్డం



చిగురుమామిడి, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి విలేకరి):

కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలోని గణేష్‌నగర్ (బోడగడ్డ)లో మంచినీటి బోరు వద్దకు వెళ్లే దారిలో నెట్‌వర్క్ వైరు అడ్డంగా ఉండటంతో కాలనీవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ బోరు నీటిని పలువురు తాగునీటి అవసరాలకు వినియోగిస్తున్నారని స్థానికులు తెలిపారు. ముఖ్యంగా మహిళలు తలపై బిందెలతో నీరు తెచ్చే సమయంలో వైరు తగిలి ప్రమాదం జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. సంబంధిత నెట్‌వర్క్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వైరు ఎత్తులో ఏర్పాటు చేసి, ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలని గణేష్‌నగర్ వాసులు కోరుతున్నారు.

తొమ్మిదో తరగతి చదువుతోనే.. ట్రాక్టర్ లెక్కలకు డిజిటల్ బాట!

ట్రాక్టర్ యజమానుల కోసం 'ట్రాక్టర్ ఖాతా'

యాప్ రూపొందించిన రాజు బేతి



రాయికల్, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి)

ప్రభుత్వ పాఠశాలలో తొమ్మిదో తరగతి వరకు చదివిన జగిత్యాల జిల్లా రాయికల్ మండలం ఇటిక్యాల గ్రామానికి చెందిన రాజు బేతి తన పట్టుదలతో ట్రాక్టర్ యజమానులకు ఉపయోగపడే 'ట్రాక్టర్ ఖాతా' మొబైల్ యాప్‌ను రూపొందించారు. ట్రాక్టర్లతో రైతులకు చేసిన పనులు, గంటలు, ఎకరాలు, ట్రిప్పులు, చెల్లింపులు, బాకీలు, డీజిల్ ఖర్చుల వివరాలను సులభంగా నమోదు చేసుకునేలా ఈ యాప్‌ను అభివృద్ధి చేశారు. ప్రతి రైతుకు ప్రత్యేక ఖాతా ఉండటంతో పనుల వివరాలు, చెల్లింపులు, బకాయిలను ఒకేచోట తెలుసుకోవచ్చు. ఇంటర్నెట్ లేకున్నా వివరాలు నమోదు చేసుకోవచ్చు. క్లౌడ్ సదుపాయం ద్వారా మొబైల్ మారినా పాత రికార్డులను తిరిగి పొందవచ్చని రాజు తెలిపారు. తెలుగు, ఇంగ్లీష్ భాషల్లో రూపొందించిన ఈ యాప్‌లో చెల్లింపుల వివరాలు నమోదు చేయడంతోపాటు, రైతువారీ లెక్కలను పీడీఎఫ్ రూపంలో పొందే సదుపాయం కూడా ఉంది. ట్రాక్టర్ యజమానులు తమ లెక్కలను మొబైల్‌లోనే సులభంగా నిర్వహించుకోవాలన్నదే తన లక్ష్యమని రాజు బేతి తెలిపారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రైతులకు, ట్రాక్టర్ యజమానులకు ఉపయోగపడే పరిష్కారం రూపొందించిన ఆయనను స్థానికులు అభినందిస్తున్నారు.

ఐలమ్మ విగ్రహాన్ని ధ్వంసం చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

చాకలి ఐలమ్మను తెలంగాణ తల్లిగా

ప్రకటించాలి: బీజేపీ నేత పారెల్లి మహేష్

చిలుకూరు, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి)



మెదక్‌లోని ఆటోనగర్ కూడలిలో వీరనారి చాకలి ఐలమ్మ విగ్రహాన్ని గుర్తుతెలియని వ్యక్తులు ధ్వంసం చేయడాన్ని బీజేపీ చిలుకూరు మండల అధ్యక్షుడు పారెల్లి మహేష్ తీవ్రంగా ఖండిం చారు. ఈ ఘటన తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని పేర్కొన్నారు. పోలీసులు సమగ్ర విచారణ జరిపి నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ధ్వంసమైన ప్రదేశంలో వెంటనే కొత్త విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, చాకలి ఐలమ్మను అధికారికంగా తెలంగాణ తల్లిగా ప్రకటించాలని కోరారు. లేనిపక్షంలో రజక, ప్రజా సంఘాలతో కలిసి ఆందోళన చేపడతామని హెచ్చరించారు.



ఘనంగా దుర్గాదేవి కుంకుమ పూజలు

కోరుట్ల రూరల్, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి)

దుర్గాదేవి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా కోరుట్ల మండలంలోని మోహన్‌రావుపేట, చిన్నమెట్‌పల్లి గ్రామాల్లో అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజలు నిర్వహించారు. మోహన్‌రావుపేటలో భక్తులకు అన్నదాన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు, యువజన సంఘాల సభ్యులు, మహిళలు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

దసరా ఉత్సవాల్లో మత్తు పదార్థాలపై అవగాహన

యువతను మత్తు పదార్థాలకు దూరంగా ఉంచడమే లక్ష్యం



ఇబ్రహీంపట్నం, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి విలేకరి)

దసరా ఉత్సవాల సందర్భంగా యువతకు మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించడంతో పాటు, వారిని వాటికి దూరంగా ఉంచాలనే ఉద్దేశంతో జగిత్యాల జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నం పోలీస్ క్రికెట్ లీగ్‌ను ప్రారంభించారు. జగిత్యాల ఎస్పీ అశోక్ కుమార్, ఐపీఎస్ సూచనల మేరకు, మెట్‌పల్లి డీఎస్పీ రాములు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ బి. సురేష్ బాబు ఆలోచనతో ఇబ్రహీంపట్నం మండల కేంద్రంలో ఈ క్రికెట్ లీగ్‌కు శ్రీకారం చుట్టారు. ఇబ్రహీంపట్నం ఎస్సై జి. నవీన్ కుమార్ లీగ్‌ను ప్రారంభించారు. మండలంలోని వివిధ గ్రామాల యువత ఈ పోటీల్లో పాల్గొననున్నారు. పోలీసు సిబ్బంది కూడా క్రికెట్ లీగ్‌లో ఆడతారని ఎస్సై నవీన్ కుమార్ తెలిపారు.

గుంటల భూముల రిజిస్ట్రేషన్లు నిలిపివేయడంపై కలెక్టర్‌కు ఫిర్యాదు

అవసరమైతే ముఖ్యమంత్రిని కూడా కలుస్తాం: బిడెకన్నే హన్మంతప్ప

నారాయణఖేడ్, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి ప్రతినిధి)



నారాయణఖేడ్ నియోజకవర్గంలో గుంటల చొప్పున భూముల రిజిస్ట్రేషన్లు నిలిపివేయడంపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఖేడ్ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ బిడెకన్నే హన్మంతప్ప తెలిపారు. మంగళవారం ఆయన ప్రకటనలో మాట్లాడుతూ.. గత 15 రోజులుగా తహసీల్దార్ కార్యాల యాల్లో గుంటల భూముల రిజిస్ట్రేషన్లు చేయకపోవడంతో కొనుగోలుదారులు, ఫాంల్యాండ్ల యజమానులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. భూ భారతి ద్వారా స్లాట్ బుక్ చేసుకుని, ప్రభుత్వానికి చలాన్లు చెల్లించినా రిజిస్ట్రేషన్లు జరగకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇతర ప్రాంతాల్లో లేని ఆంక్షలు నారాయణఖేడ్‌లోనే ఎందుకు విధిస్తున్నారో రెవెన్యూ అధికారులు స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్‌లో ఉన్న రిజిస్ట్రేషన్లను వెంటనే పూర్తి చేయాలని కోరారు. ఫాంల్యాండ్ల యజమానులతో కలిసి కలెక్టర్‌కు, అవసరమైతే ముఖ్యమంత్రికి కూడా ఫిర్యాదు చేస్తామని హన్మంతప్ప హెచ్చరించారు.

హైదరాబాద్‌కు దీటుగా జగిత్యాల జేఎన్‌టీయూ

- యూనివర్సిటీ హోదా దిశగా అడుగులు.. త్వరలో ఎంబీఏ కోర్సు
- ఏఐ, రోబోటిక్స్‌లో శిక్షణతో ఉపాధి అవకాశాలు



జగిత్యాల, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి ప్రతినిధి)

జగిత్యాల జేఎన్‌టీయూ కళాశాలను హైదరాబాద్ ప్రధాన క్యాంపస్‌కు దీటుగా అభివృద్ధి చేస్తున్నామని జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ జయలక్ష్మి తెలిపారు. జగిత్యాల క్యాంపస్‌కు యూనివర్సిటీ హోదా కల్పించే అంశం ప్రభుత్వ పరిశీలనలో ఉందని, త్వరలో ఎంబీఏ వంటి కొత్త కోర్సులు ప్రారంభించేందుకు కృషి చేస్తున్నామని వెల్లడించారు. మంగళవారం కొండగట్టు శ్రీ ఆంజనేయ స్వామిని దర్శించుకున్న అనంతరం ఆమె విలేకరులతో మాట్లాడారు. ఉత్తర తెలంగాణ విద్యార్థులకు నాణ్యమైన సాంకేతిక విద్యను అందించడమే లక్ష్యమని పేర్కొన్నారు. ఏఐ, రోబోటిక్స్, ఏఆర్/వీఆర్, ఎలక్ట్రిక్ వాహనాల సాంకేతికతలో పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. టీసీఎస్, జేటీపీఐ, ఎంఎస్ఎంఈ సంస్థల సహకారంతో నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నామని వివరించారు. బజాజ్ సంస్థ సామాజిక బాధ్యత నిధులతో హైదరాబాద్‌లో సుమారు రూ.20 కోట్లతో ఏర్పాటు చేస్తున్న ఆధునిక ప్రయోగశాలలు వచ్చే జనవరి నాటికి అందుబాటులోకి రానున్నాయని చెప్పారు. అక్కడ జగిత్యాల విద్యార్థులకూ శిక్షణ కల్పిస్తామని తెలిపారు. ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై పట్టు సాధించి, పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యాలు పెంపొందించుకుంటే మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయని జయలక్ష్మి సూచించారు.

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక

డాక్టర్ జీఎస్సార్ ఆధ్వర్యంలో ఘనంగా నాన బియ్యం బతుకమ్మ సంబరాలు

విద్యానగర్ జనసేన పార్టీ కార్యాలయంలో మహిళల ఆటపాటలతో సందడి



కొత్తగూడెం, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి)

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ పండగ సంబరాల్లో భాగంగా 4వ రోజు నాన బియ్యం బతుకమ్మ వేడుకలు కొత్తగూడెంలోని విద్యానగర్ జనసేన పార్టీ కార్యాలయంలో ఉత్సాహభరిత వాతావరణంలో ఘనంగా జరిగాయి. డాక్టర్ జీఎస్సార్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ సంబరాల్లో మహిళలు, చిన్నారులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆటపాటలతో సందడి చేశారు. ఈ వేడుకల్లో పాల్గొన్న జనసేన వీరమహిళలు స్థానిక మహిళలతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొని ఉత్సాహాన్ని నింపి మహిళలకు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. బతుకమ్మ పండుగ తెలంగాణ ఆడపడుచుల ఆత్మగౌరవానికి, ఐక్యతకు ప్రతీక అని పేర్కొన్నారు. తరతరాలుగా వస్తున్న సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షిస్తూ భావితరాలకు అందించడంలో ఇలాంటి వేడుకలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. బతుకమ్మ పండుగ ప్రతి ఇంటా ఆనందాన్ని నింపాలని, ప్రజలందరికీ సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, సిరిసంపదలు కలగాలని ఆకాంక్షించారు. మహిళలు, చిన్నారులు, పెద్దల భాగస్వామ్యంతో వేడుకలు పండుగ వాతావరణాన్ని తలపించేలా జరిగిన ఈ సంబరాల్లో పాల్గొన్న మహిళల్లో ఒకరికి పట్టుచీర, 5 గురుకి కన్సోలేషన్ బహుమతులను నిర్వాహకులు అందించనున్నారు.

ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలి

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మెకు దాస్యం వినయ్ భాస్కర్ మద్దతు





తెలంగాణ వాణి,ఉమ్మడి వరంగల్ బ్యూరో, (అక్టోబర్ 13)

: ఎన్‌హెచ్‌ఎం (జాతీయ ఆరోగ్య మిషన్) ఉద్యోగుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వ మాజీ చీఫ్ విప్, మాజీ ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ డిమాండ్ చేశారు. ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మెకు ఆయన మద్దతు ప్రకటించి, ఆందోళనలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల పాత్ర కీలకమని పేర్కొన్నారు. ఎండా, వానా అనే తేడా లేకుండా ప్రజారోగ్య పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తున్న ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం నిర్లక్ష్యం చేయడం సరికాదన్నారు. ఉద్యోగ భద్రత, వేతనాలు తదితర సమస్యల పరిష్కారం కోసం వారు సమ్మెకు దిగాల్సి రావడం విచారకరమని పేర్కొన్నారు.ఉద్యోగుల డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి,వారితో చర్చలు జరిపి సమస్యలను పరిష్కరించాలని కోరారు. ఆరోగ్య శాఖలో పనిచేసే ఉద్యోగులకు తగిన గుర్తింపు, గౌరవం, భద్రత కల్పించినప్పుడే ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందుతాయని అన్నారు.ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల న్యాయమైన హక్కుల సాధన కోసం భారత రాష్ట్ర సమితి అండగా ఉంటుందని, సమస్యలు పరిష్కారమయ్యే వరకు తన మద్దతు కొనసాగుతుందని దాస్యం వినయ్ భాస్కర్ భరోసా ఇచ్చారు.

ప్రభుత్వ ఆసుపత్రిలో ఘనంగా బతుకమ్మ సంబరాలు





చౌటుప్పల్, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)

చౌటుప్పల్‌లోని బంగారుగడ్డ ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో జిల్లా ప్రభుత్వ ఆసుపత్రుల సమన్వయ అధికారి డాక్టర్ సూర్యశ్రీరావు ఆధ్వర్యంలో మంగళవారం బతుకమ్మ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఆసుపత్రి వార్డులను పూలతో అలంకరించి, వైద్యులు, నర్సింగ్ అధికారులు, సిబ్బంది బతుకమ్మలను పేర్చి ఆటపాటలతో సందడి చేశారు. ముఖ్య అతిథులుగా మున్సిపల్ చైర్‌పర్సన్ మొగుదాల పావని, కౌన్సిలర్ బత్తుల జయమ్మ పాల్గొన్నారు. అనంతరం పారిశుద్ధ్య సిబ్బందికి దసరా కానుకగా నూతన వస్త్రాలు అందజేసి, బతుకమ్మ పోటీల విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎంవో చంద్రశేఖర్, వైద్యులు డాక్టర్ వైష్ణవి, డాక్టర్ విజయలక్ష్మి, డాక్టర్ వరలక్ష్మి ప్రియ, డాక్టర్ కావేరి, డాక్టర్ నజీమా, డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ అవినాష్, సీనియర్ అసిస్టెంట్లు జయమ్మ, కవిత, నర్సింగ్ సూపరింటెండెంట్లు భాగ్యమ్మ, రజనీ లక్ష్మి, హెడ్ నర్సులు అనంత, వీరమ్మ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ వాణి కథనాలతో కదిలిన యంత్రాంగం!

భూగర్భ జలాల అక్రమ తరలింపుపై చర్యలు.. నీటి ట్యాంకర్లు సీజ్

తెల్లాపూర్, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి ప్రతినిధి)

సంగారెడ్డి జిల్లా తెల్లాపూర్ శివారులో భూగర్భ జలాలను భారీ మోటార్లతో తోడి, ట్యాంకర్ల ద్వారా తరలిస్తూ వ్యాపారం చేస్తున్నారనే ఆరోపణలపై ఎట్టకేలకు అధికారులు స్పందించారు. ఈ వ్యవహారంపై తెలంగాణ వాణి వరుస కథనాలు ప్రచురించడంతో అధికారులు చర్యలు చేపట్టి నీటి ట్యాంకర్లను సీజ్ చేశారు.భూగర్భ జలాల అక్రమ వినియోగాన్ని అరికట్టాలని కోరుతూ 2026 సెప్టెంబర్ 28న





తెల్లాపూర్ శివారులో అక్రమ నీటి వ్యాపారంపై అధికారుల మౌనం!

ఫిర్యాదు చేసి 15 రోజులు గడిచినా స్పందన కరువు

తెల్లాపూర్, అక్టోబర్ 12 (తెలంగాణ వాణి ప్రతినిధి)

తెల్లాపూర్ శివారు ప్రాంతంలో భూగర్భ జలాలను భారీ మోటార్లతో తోడుతూ, ట్యాంకర్ల ద్వారా తరలించి వ్యాపారం చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఈ వ్యవహారంపై ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని ఫిర్యాదుదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భూగర్భ జలాల అక్రమ తోడకాన్ని అరికట్టాలని కోరుతూ సెప్టెంబర్ 28, 2026న సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినట్లు వారు తెలిపారు. అయితే 15 రోజులు గడిచినా రామచంద్రాపురం రెవెన్యూ అధికారుల నుంచి స్పందన లేదని పేర్కొన్నారు. ఒకవైపు నీటి కొరతపై ఆందోళనలు వ్యక్తమవుతున్న తరుణంలో, మరోవైపు భూగర్భ జలాలను ట్యాంకర్ల ద్వారా తరలిస్తున్నారనే ఆరోపణలు స్థానికుల్లో చర్చనీయాంశంగా మారాయి. ఇదే పరిస్థితి కొనసాగితే భవిష్యత్తులో తాగునీటి సమస్యలు తలెత్తే ప్రమాదం ఉందని ప్రజలు ఆందోళన చెందుతున్నారు.జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినా చర్యలు ఎందుకు తీసుకోవడం లేదని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఉన్నతాధికారులు వెంటనే స్పందించి, నీటి తోడకానికి సంబంధించిన అనుమతులను పరిశీలించాలని, అక్రమాలు నిర్ధారణ అయితే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సంగారెడ్డి జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు అందజేశారు. అయినప్పటికీ చర్యలు లేకపోవడంతో స్థానికుల ఆందోళనలను, భూగర్భ జలాల పరిరక్షణ ఆవశ్యకతను తెలంగాణ వాణి కథనాల ద్వారా అధికారుల దృష్టికి తీసుకెళ్లింది. దీంతో అధికారులు రంగంలోకి దిగి ట్యాంకర్లను స్వాధీనం చేసుకున్నారు.భవిష్యత్తులో నీటి కొరత ఏర్పడకుండా భూగర్భ జలాల వినియోగంపై నిరంతర పర్యవేక్షణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు. అక్రమ నీటి తరలింపుపై పూర్తిస్థాయిలో విచారణ జరిపి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ప్రజల సమస్యలే ఎజెండాగా.. ప్రజల పక్షాన తెలంగాణ వాణి!

ఎమ్మెల్యే సొంతూరిలోనే దళితులకు ఆలయ ప్రవేశంపై వివాదం!

- **మంగంపల్లిలో కులవివక్ష ఆరోపణలు.. ఎమ్మెల్యే మౌనంపై దళిత సంఘాల ఆగ్రహం**
- **సుధీర్‌పై దుర్భాషలు, దాడికి యత్నించారంటూ ఫిర్యాదు**
- **ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేసి బాధ్యులను అరెస్టు చేయాలని డిమాండ్**

వనపర్తి, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి ప్రతినిధి)

రాజ్యాంగం కల్పించిన సమానత్వ హక్కులు కాగితాలకే పరిమితమవుతున్నాయా? ప్రజాస్వామ్యంలోనూ కులవివక్షకు చోటెందుకు? ప్రజాప్రతినిధుల సమక్షంలోనే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటే సామాన్యులకు న్యాయం ఎలా జరుగుతుందనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. పెద్దమందడి మండలంలోని ఎమ్మెల్యే సొంత గ్రామమైన మంగంపల్లిలో ఆలయ ప్రవేశం విషయంలో దళితులపై వివక్ష చూపుతున్నారన్న ఆరోపణలు ఇప్పుడు చర్చనీయాంశంగా మారాయి.

ఆలయ దర్శనానికి వెళ్తే దుర్భాషలాడారంటూ ఆరోపణ

గ్రామంలోని ఆలయ పునర్నిర్మాణానికి ప్రభుత్వ నిధుల నుంచి రూ.కోటి కేటాయించిన నేపథ్యంలో సోమవారం శంకుస్థాపన, పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా దళితులకు ఆలయ ప్రవేశం ఎందుకు కల్పించడం లేదని ప్రశ్నిస్తూ మాసాని సుధీర్ ఆలయ దర్శనానికి వెళ్లినట్లు దళిత సంఘాల నాయకులు తెలిపారు. ఈ క్రమంలో కొందరు ఆయనను అడ్డుకుని, మాదిగలకు ఆలయ ప్రవేశం లేదంటూ దుర్భాషలాడి దాడికి ప్రయత్నించారని ఆరోపించారు. ఈ ఘటన జరిగిన సమయంలో ఎమ్మెల్యే అక్కడే పూజా కార్యక్రమాల్లో పాల్గొంటున్నప్పటికీ, వివక్షను అడ్డుకునేందుకు చర్యలు తీసుకోలేదని దళిత సంఘాల నాయకులు విమర్శించారు. కొద్దిరోజుల క్రితమే దళితులకు ఆలయ ప్రవేశం కల్పించాలని వినతిపత్రం ఇచ్చినా స్పందన లేదని ఆవేదన వ్యక్తం చేశారు.

ఎస్సీ, ఎస్టీ కేసులు నమోదు చేయాలని డిమాండ్

తమపై దుర్భాషలాడి భయభ్రాంతులకు గురిచేశారని ఆరోపిస్తూ



వెంకటరామిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిలపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసులు నమోదు చేసి చర్యలు తీసుకోవాలని మాసాని సుధీర్‌తో పాటు దళిత సంఘాల ప్రతినిధులు పోలీసులను కోరారు. ఈ మేరకు ఎస్పీకి వినతిపత్రం సమర్పించడంతో పాటు పోలీస్‌స్టేషన్‌లో మరోసారి ఫిర్యాదు చేసినట్లు తెలిపారు.

గ్రామాన్ని సందర్శించి న్యాయం చేయాలి

మంగంపల్లిని సందర్శించిన దళిత, బహుజన సంఘాల నాయకులు సుధీర్‌కు మద్దతు ప్రకటించారు. గ్రామంలో కులవివక్షకు తావులేకుండా అందరికీ ఆలయ ప్రవేశం కల్పించాలని, సుధీర్ కుటుంబంతో పాటు గ్రామంలోని దళితులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. జిల్లా కలెక్టర్, సంబంధిత అధికారులు గ్రామాన్ని సందర్శించి సమస్యను పరిష్కరించాలని కోరారు. అవసరమైతే శాంతి సామరస్యాలను పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. దళితులపై వివక్షకు పాల్పడినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని ప్రజా సంఘాల నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దొడ్ల రాములు, కొమ్ము చెన్నయ్య, పానుగంటి సురేష్‌కుమార్, స్వేరో రామకృష్ణ, కొమ్ము చెన్నకేశవులు తదితరులు పాల్గొన్నారు.

ఇప్పుడైనా స్పందిస్తారా?

మంగంపల్లి ఘటనపై వచ్చిన ఆరోపణలు అధికార యంత్రాంగానికి సవాలుగా మారాయి. ఆలయ ప్రవేశంపై వివాదానికి ముగింపు పలికి, బాధితుల ఫిర్యాదుపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, చట్టప్రకారం చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత పోలీసు యంత్రాంగంపై ఉంది. రాజ్యాంగం హామీ ఇచ్చిన సమానత్వం ఆచరణలోనూ కనిపించేలా అధికారులు చర్యలు తీసుకుంటారా అన్నది వేచి చూడాలి.

భూముల రీసర్వేను పకడ్బందీగా పూర్తి చేయాలి

సర్వేయర్లకు ఆర్డీఓ సుబ్రహ్మణ్యం ఆదేశం



వనపర్తి, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి ప్రతినిధి)

రైతులకు ప్రస్తుత, భవిష్యత్ భూ సమస్యలు తలెత్తకుండా రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూముల సమగ్ర రీసర్వేను నిర్ణీత గడువులోగా పకడ్బందీగా పూర్తి చేయాలని ఆర్డీఓ సుబ్రహ్మణ్యం సర్వేయర్లను ఆదేశించారు. మంగళవారం పెద్దమందడి మండలం వీరాయిపల్లి, ఘనపూర్ మండలం మల్కాపూర్ గ్రామాల్లో జరుగుతున్న రీసర్వే పనులను ఆయన పరిశీలించారు. వీరాయిపల్లి గ్రామ విస్తీర్ణ సర్వే పూర్తయిందని, మల్కాపూర్‌లో మరో వారం రోజుల్లో సర్వే పూర్తవుతుందని తెలిపారు. బుధవారం నుంచి పట్టా భూముల్లో ఎంజాయ్‌మెంట్ సర్వే నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. రైతులు రీసర్వే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, సర్వేకు సహకరించాలని కోరారు. ఆయన వెంట తహసీల్దార్లు, రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్లు ఉన్నారు.

కలెక్టరేట్‌లో ఘనంగా వయోవృద్ధుల దినోత్సవ వేడుకలు



నిర్మల్ టౌన్, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి విలేఖరి)

జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం నిర్మల్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో అంతర్జాతీయ వయోవృద్ధుల దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా స్వయం సహాయక సంఘాలకు చెందిన 189 మంది వయోవృద్ధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి విజయలక్ష్మి మాట్లాడుతూ, స్వయం సహాయక సంఘాల ద్వారా వయోవృద్ధులకు కలిగే ఆర్థిక, సామాజిక ప్రయోజనాలను వివరించారు. పొదుపు అలవాటు, ఆర్థిక స్వావలంబన, జీవనోపాధి అవకాశాలు, ప్రభుత్వ సంక్షేమ పథకాల వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం వయోవృద్ధులతో బతుకమ్మలను తయారు చేయించి, ఆటపాటలతో సంబరాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

దళితులకు గుడి ప్రవేశం అడ్డుకున్న అగ్రవర్ణాలు

- **దర్శనం చేసుకున్నందుకు దళితుడిపై ముకుమ్మడిగా దౌర్జన్యం**
- **ఎమ్మెల్యే మేనమామ వెంకటరాం రెడ్డిపై ఆరోపణలు**



వనపర్తి : అక్టోబర్ 13, (తెలంగాణ వాణి ప్రతినిధి)

80ఏళ్ల స్వతంత్ర భారతదేశంలో దళితులను నేటికి వెంటాడుతున్న అంటరానితనం భారత రాజ్యాంగంలో అందరికీ సమాన హక్కులు కల్పించిన గుడి గోపురం నీడలో ఇంకా కుల వివక్ష పాతుకుపోయే ఉందా? దేవుడి ముందు అందరూ సమానమే అని చెబుతున్న ఈ కంప్యూటర్ యుగంలో కూడా, దళితుడు గుడి మెట్టు ఎక్కితే తప్పా? అవును, ఇదే ప్రశ్న ఇప్పుడు వనపర్తి జిల్లాను తీవ్రంగా పట్టిపీడిస్తుంది. చదువుకున్న సమాజం సిగ్గుతో తలదించుకునేలా, మానవత్వం మంటగలిసేలా వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి సొంత గ్రామం పెద్దమందడి మండలం మంగంపల్లిలో చోటు చేసుకుంది.మంగంపల్లి గ్రామంలో ఆలయ పునర్నిర్మాణం జరుగుతున్న వేళ, మాసాని సుధీర్ తన కుటుంబ సభ్యులతో కలిసి దేవుడిని దర్శించుకుని తిరిగి వస్తుండగా, అగ్రవర్ణాలైన గ్రామ పెద్దలు అడ్డుకుని భార్య పిల్లల ముందు ఒక్కడిపై ముక్కుమ్మడిగా దౌర్జన్యానికి పాల్పడ్డారు. నీకు ఏం హక్కు ఉందని గుడికి వచ్చారు మీరు గుడికి రాకూడదు అని తనపై దౌర్జన్యం చేశారు . ఈ దాడికి ఎమ్మెల్యే మేనమామ వెంకటరాం రెడ్డి నాయకత్వం వహించారని సుధీర్ సంచలన ఆరోపణ చేశారు.గ్రామంలో మాదిగలు అంటే ఎందుకంత చిన్నచూపు? మేము చావుల దగ్గర డప్పు కొట్టడానికి, చెప్పులు కుట్టడానికి, ఎలక్షన్ ముందు ఓట్లు వేయడానికి మాత్రమేనా? పోయినంత కాలం బానిస బతుకులేనా?" అంటూ మాసాని సుధీర్ ప్రశ్నిస్తున్నారు.

దళితుడికి ఇంత అవమానమా అంటూ ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. "ఇకనైనా మాదిగ బిడ్డలారా మేల్కోండి, మాదిగ అంటే చెప్పులు కుట్టడమే కాదు, రాజ్యాన్ని ఏలే వాళ్లమని మరోసారి గుర్తు చేయాలి. పోరాడితే పోయేది బానిస సంకెళ్లు తప్ప ఏమీ లేదు"

ఎమ్మెల్యే సొంత ఊర్లోనే ఇలా జరిగితే, నియోజకవర్గంలో దళితుల పరిస్థితి ఏంటని దళిత సంఘాలు ప్రశ్నిస్తున్నాయి. ఈ ఘటనపై జిల్లా కలెక్టర్, ఎస్పీ జోక్యం చేసుకుని విచారణ జరిపి నిందితులపై ఎస్సీ /ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేయాలి.



నిబంధనలు ఉల్లంఘించిన ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలి

డీఈవోకు బీజేపీ నాయకుల వినతి

వనపర్తి, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి ప్రతినిధి)

భారత ఎన్నికల సంఘానికి వ్యతిరేకంగా వనపర్తి పట్టణంలోని రాజీవ్ చౌరస్తాలో నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ప్రభుత్వ ఉపాధ్యాయులపై విచారణ జరిపి, నిబంధనలు ఉల్లంఘించినట్లు తేలితే చర్యలు తీసుకోవాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు పట్టణ అధ్యక్షుడు బత్తిని మధుసూదన్ ఆధ్వర్యంలో జిల్లా విద్యాశాఖ అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామన్నగారి వెంకటేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ ఉద్యోగులు సేవా నియమావళికి అనుగుణంగా వ్యవహరించాలని సూచించారు. ఉపాధ్యాయుల నిరసనలో పాత్రపై నిష్పక్షపాతంగా విచారణ జరిపి, నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు నిర్ధారణ అయితే తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా మీడియా కన్వీనర్ గజరాజుల తిరుమలేష్, జిల్లా అధికార ప్రతినిధి నక్క మహేష్, జిల్లా వాణిజ్య సెల్ కన్వీనర్ కొండోజు గోపీనాథ్ బీజేవైఎం జిల్లా అధ్యక్షులు అరవింద్ తదితరులు పాల్గొన్నారు.

భవాని యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం



చౌటుప్పల్, అక్టోబర్ 13(తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)

మాహా దానాలలో అన్నదానం మహా శ్రేష్టమని చౌటుప్పల్ మున్సిపల్ చైర్మన్ మొగుదాల పావని అన్నారు. పట్టణ కేంద్రంలోని భవాని యూత్ ఆధ్వర్యంలో మంగళవారం అన్నదాన కార్యక్రమాన్ని మున్సిపల్ చైర్మన్ మొగుదాల పావని ప్రారంభించారు. భవాని యూత్ అసోసియేషన్ వారు చేస్తున్న కార్యక్రమాలు ఎంతో సంతోషాన్ని కలిగిస్తాయని ప్రముఖ వైద్యురాలు డా శ్వేత ప్రియాంక మూల సుధీర్ లు అన్నారు. ఈ కార్యక్రమంలో 19 వ వార్డు కౌన్సిలర్ పిల్లలమర్రి మధుసూదన్, భవాని యూత్ వ్యవస్థాపక అధ్యక్షుడు వరగంటి రాజేందర్ గౌడ్, గౌరవ అధ్యక్షుడు గోపగోని లక్ష్మణ్ గౌడ్, అధ్యక్షుడు వరగంటి మహేందర్ గౌడ్, కన్వీనర్ బొబ్బిళ్ళ సుభాష్ కుమార్, మారుపాక శ్రీశైలం గౌడ్, మునుకుంట్ల చంద్రశేఖర్, వరగంటి అమరేందర్ గౌడ్, కాసాని సాయి కుమార్ గౌడ్, అవిరేణి ప్రభాస్ రాజ్, దండేపల్లి శివ, బొబ్బిళ్ళ ఉత్తేజ్, వరగంటి వరుణ్ కుమార్ గౌడ్, దండేపల్లి శంకర్, మారుపాక మహేష్ గౌడ్, వినయ్, ఉడుగు గౌతమ్ గౌడ్, ఏర్కాలి అభిరామ్ గౌడ్, బిజిలి బబ్లు, మారుపాక రామ్ చరణ్ గౌడ్, వినీత్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతి ఇంటి ముందు మొక్క నాటాలి

స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో చెత్త బుట్టలు, మొక్కల పంపిణీ





చౌటుప్పల్, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి డివిజన్ ప్రతినిధి)

స్వచ్ఛతా హీ సేవా--2026 కార్యక్రమంలో భాగంగా చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి ఐదో వార్డులో మంగళవారం శివాలయం వద్ద తడి, పొడి చెత్త బుట్టలతో పాటు మొక్కలను కౌన్సిలర్ కొయ్యడ శేఖర్ గౌడ్ కాలనీవాసులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఇంట్లో తడి, పొడి చెత్తను వేర్వేరుగా సేకరించి పారిశుద్ధ్య కార్మికులకు అందించాలని సూచించారు. ప్రతి ఇంటి ముందు ఒక మొక్క నాటి, దాని సంరక్షణ బాధ్యతను ఇంటి యజమానులు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు ఇన్‌చార్జి భాష, శానిటరీ విభాగం సిబ్బంది హనుమాన్ ప్రసాద్, వార్డు ప్రకృతి వనం ఇన్‌చార్జి రేణుకుమార్, కాలనీవాసులు పాల్గొన్నారు.

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక

అద్దె కార్లను తనఖా పెట్టి రూ.14.50 లక్షలు స్వాహా!

నకిలీ పత్రాలతో వాహనాల బదిలీకి యత్నం.. ప్రధాన నిందితుడు అరెస్ట్

కీసర, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి)



అద్దెకు తీసుకున్న కార్లను యజమానులకు తిరిగి ఇవ్వకుండా ఇతరుల వద్ద తనఖా పెట్టి రూ. 14.50 లక్షలు పొందిన కేసులో ప్రధాన నిందితుడు వడ్డె మహేష్ (42)ను కీసర పోలీసులు అరెస్ట్ చేశారు. ఐదు కార్లకు సంబంధించిన తనఖా, బదిలీ లావాదేవీల ద్వారా నిందితుడు డబ్బు పొందినట్లు ప్రాథమిక దర్యాప్తులో వెల్లడైందని మల్కాజిగిరి జోన్ డీసీపీ సీహెచ్. శ్రీధర్ తెలిపారు. రాంపల్లి ఆర్ఎల్ నగర్‌లో హరిత టూర్స్ అండ్ ట్రావెల్స్ నిర్వహిస్తున్న మహేష్.. కారు యజమానులకు అద్దె చెల్లించకుండా వాహనాలను ఇతరుల వద్ద తనఖా పెట్టినట్లు పోలీసులు గుర్తించారు. మరో కారును బదిలీ చేసేందుకు సంతకం ఫోర్జరీ చేసి, ఫారం-35ను ఉపయోగించినట్లు దర్యాప్తులో తేలిందని తెలిపారు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు నిందితుడి నుంచి ఐదు కార్లు, మొబైల్ ఫోన్, వాహన బదిలీకి ఉపయోగించిన ఫారం-35ను స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని న్యాయస్థానం ఎదుట హాజరుపరిచేందుకు చర్యలు చేపట్టారు. ఏసీపీ ఎస్. చక్రపాణి మార్గదర్శకత్వంలో కీసర ఇన్‌స్పెక్టర్ బిక్కి రమేష్, ఎస్ఐ ఎస్. అనిల్‌కుమార్, కానిస్టేబుల్ శ్రీధర్ కేసును దర్యాప్తు చేశారు. వాహనాలను అద్దెకు ఇచ్చే యజమానులు ఒప్పంద పత్రాలు, అద్దెదారుల వివరాలను జాగ్రత్తగా పరిశీలించాలని పోలీసులు సూచించారు.

బతుకమ్మ వేడుకల ఏర్పాట్లపై పరిశీలన



మందమర్రి, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి)

బతుకమ్మ పండుగ సందర్భంగా మందమర్రి పాత బస్టాండ్ సమీపంలోని మినీ ట్యాంక్‌బండ్‌పై ప్రజలకు అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చేపట్టనున్న ఏర్పాట్లను మంగళవారం కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మంద తిరుమల్‌రెడ్డి పరిశీలించారు. పండుగకు వచ్చే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని మున్సిపల్ కమిషనర్ రాజలింగును కోరినట్లు తెలిపారు. దీనిపై కమిషనర్ సానుకూలంగా స్పందించి ఏర్పాట్లు చేస్తామని హామీ ఇవ్వడంతో కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ రాజలింగు, కాంగ్రెస్ నాయకులు సోతుకు సుదర్శన్, గుడ్ల రమేష్, నోముల ఉపేందర్ గౌడ్, రాజయ్య, పుల్లూరి లక్ష్మణ్, పైడిమల్ల నర్సింగ్, నెరువట్ల శ్రీనివాస్, మహంత్ అర్జున్, ఎర్ర రాజు, జావిద్ ఖాన్, రాయభారపు కిరణ్, శశిధర్, షరీఫ్, యాకుబ్, ముడారపు శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఘనంగా బతుకమ్మ సంబరాలు

ఆటపాటలతో అలరించిన మహిళలు.. విజేతలకు ప్రత్యేక బహుమతులు



నిజామాబాద్ సిటీ, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి)

తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలు నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని పాత కలెక్టరేట్ మైదానంలో తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. తొమ్మిది రోజుల బతుకమ్మ ఉత్సవాల సందడిని ప్రతిబింబించేలా మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సంప్రదాయ పాటలు, ఆటలతో సందడి చేశారు. పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొనడంతో మైదానం పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది. తెలంగాణ జాగృతి రాష్ట్ర మహిళా అధ్యక్షురాలు మానుకోట సనీత, రాష్ట్ర మహిళా కార్యదర్శి దొండి స్వర్ణలత, జిల్లా అధ్యక్షుడు అవంతి కుమార్ ఆధ్వర్యంలో ఈ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర నాయకుడు రామ్‌కిషన్‌రావు హాజరై మహిళలతో కలిసి బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మానుకోట సనీత మాట్లాడుతూ.. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టేలా ప్రతి ఏడాది తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో బతుకమ్మ వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నామని తెలిపారు. తెలంగాణ అస్తిత్వానికి ప్రతీకగా నిలిచిన బతుకమ్మ పండుగను ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు పొందేలా చేయడంలో జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కవిత కీలక పాత్ర పోషించారని కొనియాడారు. కవిత ఆదేశాల మేరకు ఈ ఏడాది కూడా నవరాత్రుల సందర్భంగా బతుకమ్మ సంబరాలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఆటపాటలతో వేడుకలకు మరింత ఉత్సాహాన్ని తీసుకొచ్చారని తెలిపారు. అనంతరం బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న మహిళలకు ప్రత్యేక బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ జాగృతి సీనియర్ నాయకులు లక్ష్మీనారాయణ భరద్వాజ్, మోహిక రెడ్డి, రేఖ శోభా, సునీత, రజిని, స్వర్ణ, చిన్న గౌడ్, మట్టు చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గుండా మల్లేష్ వర్ధంతి వేడుకలు



మందమర్రి, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి):

బెల్లంపల్లి మాజీ ఎమ్మెల్యే గుండా మల్లేష్ ఆరో వర్ధంతిని పురస్కరించుకుని మంగళవారం మందమర్రి పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో వర్ధంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి సీపీఐ నాయకులు, కార్యకర్తలు నివాళులర్పించారు. అనంతరం సీపీఐ మండల కార్యదర్శి వనం సత్యనారాయణ, పట్టణ కార్యదర్శి కామెర దుర్గారాజ్ మాట్లాడుతూ.. గుండా మల్లేష్ తన జీవితాన్ని పేదలు, కార్మికులు, కర్షకులు, అణగారిన వర్గాల హక్కుల కోసం అంకితం చేసిన ప్రజా నాయకుడని కొనియాడారు. కార్మికుల హక్కుల పరిరక్షణ, పేదలకు న్యాయం కోసం ఐక్యంగా ఉద్యమించడమే ఆయనకు అర్పించే నిజమైన నివాళి అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ సీనియర్ నాయకులు ఆర్ వెంకన్న ఏ ఐ వై ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఆంటోనీ దినేష్, ఎం డి.రసూల్ జక్కన బోయిన సమేందర్, హమాలి సంఘం నాయకులు. డి. సంపత్, సాగే పోశం, పూరెల్ల శ్రీనివాస్, ఆవుల కుమార్,పూరెల్ల మహేష్, దామరకుంట రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

పుష్కరాల పనులను గడువులోగా పూర్తి చేయాలి

కందకుర్తి, యంచ పుష్కర ఘాట్లను పరిశీలించిన కలెక్టర్ ఇలా త్రిపాఠి

నిజామాబాద్, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి ప్రతినిధి)



వచ్చే ఏడాది జూన్, జూలైలో జరగనున్న గోదావరి పుష్కరాల పనులను నిర్ణీత గడువులోగా నాణ్యతతో పూర్తి చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. మంగళవారం అదనపు కలెక్టర్ భుజంగరావుతో కలిసి రెంజల్ మండలం కందకుర్తి, నవీపేట మండలం యంచలోని పుష్కర ఘాట్ల పనులను పరిశీలించారు. కందకుర్తిలో దేవాదాయ శాఖ ఆధ్వర్యంలో జరుగుతున్న పనుల పురోగతిని సమీక్షించి, నీటి ప్రవాహం తగ్గిన వెంటనే మిగిలిన పనులను వేగవంతం చేసి మార్చి నెలాఖరులోగా పూర్తి చేయాలని సూచించారు. పనుల పురోగతిని వారానికి కనీసం రెండుసార్లు పర్యవేక్షించాలని అధికారులను ఆదేశించారు. యంచలో పుష్కర ఘాట్, పార్కింగ్ ప్రాంతాలను పరిశీలించి భక్తులకు తాగునీరు, మరుగుదొడ్లు, విద్యుత్, వైద్య సేవలు, పారిశుద్ధ్యం, దుస్తులు మార్చుకునే గదులు, భద్రత వంటి సదుపాయాలు కల్పించాలని సూచించారు. పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని స్పష్టం చేశారు. కలెక్టర్ వెంట బోధన్ ఆర్డీఓ విజయ కుమారి, తహసీల్దార్లు శ్రవణ్, వెంకట రమణ, దేవాదాయ, పంచాయతీరాజ్, నీటి పారుదల తదితర శాఖల అధికారులు ఉన్నారు.

షార్ట్‌ఫిల్మ్, ఫొటోగ్రఫీ పోటీలకు ఆహ్వానం

అమరవీరుల దినోత్సవం సందర్భంగా పోటీలు: ఎస్పీ అఖిల్ మహాజన్

ఆదిలాబాద్, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి ప్రతినిధి)



పోలీస్ ఫ్లాగ్ డే, అమరవీరుల దినోత్సవం సందర్భంగా విద్యార్థులు, యువత, ఔత్సాహిక ఫొటోగ్రాఫర్లు, వీడియోగ్రాఫర్లకు షార్ట్‌ఫిల్మ్, ఫొటోగ్రఫీ పోటీలు నిర్వహిస్తున్నట్లు జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ తెలిపారు. రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్ నేరాలు, కమ్యూనిటీ పోలీసింగ్, మూఢనమ్మకాల నిర్మూలన, అత్యవసర సమయాల్లో పోలీసుల సేవలు తదితర అంశాలపై కనీసం మూడు నిమిషాల నిడివితో వీడియోలు రూపొందించాలని సూచించారు. పోలీసుల సేవలను ప్రతిబింబించే ఫొటోలను కూడా సమర్పించవచ్చని తెలిపారు. పోలీసు అమరవీరుల త్యాగాలను స్మరించుకుంటూ నిర్వహిస్తున్న ఈ పోటీల్లో యువత, ఔత్సాహికులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని ఎస్పీ పిలుపునిచ్చారు

గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దాలి

అధికారులు సమన్వయంతో పనిచేయాలి: కలెక్టర్ రాజర్షి షా



ఆదిలాబాద్, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి ప్రతినిధి)

జిల్లాను గంజాయి రహితంగా తీర్చిదిద్దేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ రాజర్షి షా పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్‌తో కలిసి గంజాయి, మాదకద్రవ్యాల నిర్మూలనపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్ష నిర్వహించారు. గంజాయి సాగు, విక్రయాలు, అక్రమ రవాణాను పూర్తిస్థాయిలో అరికట్టాలని కలెక్టర్ సూచించారు. గంజాయి కట్టడిలో రాజీపడే ప్రసక్తే లేదని ఎస్పీ అఖిల్ మహాజన్ స్పష్టం చేశారు. గంజాయి విక్రయదారులు, సరఫరాదారులపై వివరాలు సేకరించి, పీడీ యాక్ట్‌తో సహా కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, సబ్ కలెక్టర్ ప్రణయ్ కుమార్, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధే లక్ష్యంగా ముందుకు..

పలు డివిజన్లలో అభివృద్ధి పనులకు భూమిపూజ చేసిన ఎమ్మెల్యే ధన్‌పాల్



నిజామాబాద్, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి ప్రతినిధి)

నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గ అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ తెలిపారు. నగరంలోని 50, 7, 20వ డివిజన్లలో పలు అభివృద్ధి పనులకు ఆయన భూమిపూజ చేశారు. కార్పొరేషన్ కౌన్సిల్ నిర్ణయం మేరకు ప్రతి డివిజన్‌కు రూ.20 లక్షల నిధులతో పనులు చేపడుతున్నట్లు పేర్కొన్నారు. నగరంలో అమృత్-2 పథకం కింద భూగర్భ డ్రైనేజీ పనులు వేగవంతం చేయాలని, తాగునీటి సమస్య పరిష్కారానికి తొమ్మిది కొత్త వాటర్ ట్యాంకుల నిర్మాణం చేపడుతున్నట్లు వివరించారు. ఖిల్లా రామాలయ అభివృద్ధిలో భాగంగా రోప్‌వే ఏర్పాటుకు కూడా చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో మేయర్ కూరగాయల ఉమారాణి, 50వ డివిజన్ కార్పొరేటర్ జగదీష్ కులకర్ణి, 7వ డివిజన్ కార్పొరేటర్ శ్రావణ్ కుమార్, 20వ డివిజన్ కార్పొరేటర్ న్యాలం సునీత, 19వ డివిజన్ కార్పొరేటర్ నాగోళ్ల లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.



త్రైతా సిద్ధాంతంపై భగవద్గీత ప్రచారం

మందమర్రి, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి)

దసరా పండుగను పురస్కరించుకుని ప్రబోధ సేవా సమితి, ఇందు జ్ఞాన వేదిక కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో మంగళవారం మందమర్రి మండలంలో త్రైతా సిద్ధాంతంపై ఆధ్యాత్మిక గ్రంథాల ప్రచారం నిర్వహించారు. ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరులు రచించిన భగవద్గీత, అనుబంధ గ్రంథాలను ప్రజలకు పరిచయం చేశారు. పది ఇంద్రియాలను జయించడమే దసరా పండుగ అంత రార్థమని కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్. రాజు, రాకేష్, నాగిరెడ్డి, రవి, వేణు, రాజు, సత్యం, సందీప్, ప్రసాద్, సతీష్, నరేందర్, ఉమమ్మ, సునీత, నాగమణి, రవళి, రష్మిత, సాహిత్, అణుతేజ్, ఆదిత్య, రూపక్, శివాష్ణు తదితరులు పాల్గొన్నారు.

సీఈఐఆర్‌తో 115 సెల్‌ఫోన్ల రికవరీ

జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు 2,492 ఫోన్లు స్వాధీనం: ఎస్పీ జానకి షర్మిల




నిర్మల్ టౌన్, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి):

సీఈఐఆర్ పోర్టల్ ద్వారా తాజాగా రికవరీ చేసిన రూ. 13.80 లక్షల విలువైన 115 సెల్‌ఫోన్లను నిర్మల్ జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల బాధితులకు అందజేశారు. జిల్లావ్యాప్తంగా ఇప్పటివరకు మొత్తం 2,492 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అప్పగించినట్లు తెలిపారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్నా, చోరీకి గురైనా వెంటనే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలని ఎస్పీ సూచించారు. సెకండ్‌హ్యాండ్ ఫోన్లు కొనుగోలు చేసేట ప్పుడు బిల్లు, ఐఎంఈఐ వివరాలను పరిశీలించాలని కోరారు. ఫోన్ల రికవరీలో కృషి చేసిన ఐటీ కోర్ సిబ్బంది, పోలీసు అధికారులను ఆమె అభినందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల తో పాటు అదనపు ఎస్పీ డి. ఉపేందర్ రెడ్డి, ఆర్ఐ అడ్మిన్ రామ్ నిరంజన్, ఐటీ కోర్ సిబ్బంది, ఇతర పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు

బాసర ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలి

గోదావరి పుష్కరాల పనుల్లో నాణ్యత తప్పనిసరి: కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్--బాసర, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి ప్రతినిధి)

బాసర శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారి నూతన ఆలయ నిర్మాణ పనులను వేగవంతం చేసి, నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు. మంగళవారం బాసరలో ఆలయ నిర్మాణ పనులను పరిశీలించి, పురోగతిపై సమీక్షించారు. రానున్న గోదావరి పుష్కరాల నేపథ్యంలో పుష్కర ఘాట్ల వద్ద భక్తులకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని, అన్ని పనులను నాణ్యతా ప్రమాణాలతో పూర్తి చేయాలని సూచి ంచారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో ముందస్తు ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. ఈ పర్యటనలో ఆలయ ఈవో అంజనా దేవి, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజా ఉద్యమాలకు గుండా మల్లేష్ ఆదర్శం

రామకృష్ణాపూర్, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి):

బూటకపు ఎన్‌కౌంటర్లకు వ్యతిరేకంగా, పేదలు, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం నిరంతరం పోరాడిన ప్రజా ఉద్యమ నాయకుడు కామ్రేడ్ గుండా మల్లేష్ అని సీపీఐ జిల్లా కార్యదర్శి రామడుగు లక్ష్మణ్ అన్నారు.రామకృష్ణాపూర్‌లోని సీపీఐ కార్యాలయంలో గుండా మల్లేష్ చిత్రపటానికి పూలమాలలు వేసి నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రామడుగు లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి మిట్టపెల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కారం, పేదల హక్కుల సాధన కోసం ఆయన చేసిన పోరాటాలు చిరస్మరణీయమని కొనియాడారు. ఆయన ఆశయాలను కొనసాగిస్తూ సామాజిక న్యాయం కోసం ఐక్యంగా ఉద్యమించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యులు, మున్సిపల్ కౌన్సిలర్లు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూముల రీసర్వే పకడ్బందీగా నిర్వహించాలి

రైతులకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలి: అదనపు కలెక్టర్ రాజాగౌడ్



నిజామాబాద్, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి ప్రతినిధి

) భూముల రీసర్వేను నిబంధనల ప్రకారం పకడ్బందీగా నిర్వహిస్తూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ రాజాగౌడ్ అధికారులను ఆదేశించారు. మంగళవారం మెండోరా మండలం వెల్గటూర్‌లో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపడంతోపాటు భూముల సరిహద్దు సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం రీసర్వే చేపడుతోందని తెలిపారు. సర్వేకు ముందు రైతులకు సమాచారం అందించి, వారి సమక్షంలోనే ప్రక్రియ నిర్వహించాలని సూచించారు. ఆధునిక సాంకేతిక పరికరాలతో సర్వే చేస్తున్నందున హద్దుల వివరాల నమోదులో పొరపాట్లు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, రైతులు పాల్గొన్నారు.

బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించాలి

పర్యాటక ప్రాజెక్టుల డీపీఆర్‌ల బాధ్యతలు రెండు వారాల్లో అప్పగించాలి: వాణీ ప్రసాద్

నిజామాబాద్, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి)



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బతుకమ్మ సంబరాలను ఘనంగా నిర్వహించి, ఫొటోలు, వీడియోల ద్వారా విస్తృత ప్రచారం కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణీ ప్రసాద్ జిల్లా కలెక్టర్లను ఆదేశించారు. మంగళవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడుతూ.. సూపర్ ఎల్‌నినో ప్రభావాలపై నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ అంశాలను బతుకమ్మ పాటల ద్వారా ప్రజలకు వివరించాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా జిల్లాలకు బదిలీ చేసిన 56 పర్యాటక ప్రాజెక్టులను స్థానిక ఇంజినీరింగ్ శాఖల సమన్వయంతో త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. రెండు వారాల్లోగా డీపీఆర్ తయారీ బాధ్యతలు అప్పగించాలని, అసంపూర్తిగా ఉన్న హరిత హోటళ్లను పీపీపీ విధానంలో ప్రైవేటు పెట్టుబడులతో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పర్యాటక ప్రాంతాల్లో మౌలిక సదుపాయాలు, భద్రతను మెరుగుపరచాలని సూచించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో కలెక్టర్ ఇలా త్రిపాఠి, జిల్లా రెవెన్యూ అధికారి గీత, జిల్లా పర్యాటక అభివృద్ధి అధికారి పవన్ కుమార్ పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ



ఆదిలాబాద్, అక్టోబర్ 13 (తెలంగాణ వాణి ప్రతినిధి)

ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని జడ్పీ హాల్‌లో మంగళవారం కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకాల లబ్ధిదారులకు చెక్కుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్, మున్సిపల్ చైర్‌పర్సన్ బండారి అనూష సతీష్‌తో కలిసి మార్కెట్ కమిటీ చైర్మన్ బోరంచు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొని లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లెపూల నర్సయ్య, ఆత్మ చైర్మన్ సంతోష్‌రావు, ఎమ్మార్వో శ్రీనివాస్, తహసీల్దార్ రాజేశ్వరి, మున్సిపల్ వైస్ చైర్మన్ మహమ్మద్ రోహిత్ తదితరులు పాల్గొన్నారు.

TELANGANA VANI TELUGU DAILY
R N I No. APTEL/2012/53127
తెలంగాణ వాణి
తెలుగు దినపత్రిక



ఐసీసీ అవార్డుల్లో గిల్, షఫాలీ వర్మకు గుర్తింపు

దుబాయ్, అక్టోబరు 13 (ఉద్యమ కెరటం): భారత క్రికెటర్లు శుభ్‌మన్ గిల్, షఫాలీ వర్మ తమ అద్భుత ప్రదర్శనలతో అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నుంచి ప్రత్యేక గుర్తింపు పొందారు. ఐసీసీ నెలవారీ ఉత్తమ ఆటగాళ్ల పురస్కారాలను వీరిద్దరూ అందుకున్నారు. పురుషుల విభాగంలో గిల్ ఈ పురస్కారాన్ని ఐదోసారి గెలుచుకోగా, మహిళల విభాగంలో షఫాలీ వర్మ తన ఆటతీరుతో మరోసారి అవార్డును దక్కించుకున్నారు. భారత జట్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ ఐసీసీ నెలవారీ ఉత్తమ పురుష ఆటగాడి పురస్కారాన్ని ఐదోసారి గెలుచుకున్నాడు. గతంలో 2023 జనవరి, సెప్టెంబరు నెలల్లో, 2025 ఫిబ్రవరి, జూలై నెలల్లో ఈ అవార్డును అందుకున్నాడు. తాజాగా మరోసారి పురస్కారం దక్కించుకోవడంతో ఈ ఘనత సాధించిన ఆటగాళ్లలో తన ప్రత్యేకతను చాటుకున్నాడు. వెస్టిండీస్‌తో జరిగిన వన్డే సిరీస్‌లో గిల్ బ్యాట్‌తో మెరిశాడు. తిరువనంతపురంలో జరిగిన తొలి వన్డేలో 110 పరుగులు సాధించగా, రెండో వన్డేలో 223 పరుగులతో సత్తా చాటినట్లు సమాచారం. తన అభిమానుల ముందు పరుగులు సాధించడం ప్రత్యేక ఆనందాన్ని ఇచ్చిందని గిల్ పేర్కొన్నాడు. ఐదోసారి ఐసీసీ పురస్కారం అందుకోవడం గర్వంగా ఉందని, తనను ఎంపిక చేసిన ఐసీసీ ప్యానెల్ సభ్యులకు కృతజ్ఞతలు తెలిపాడు. భారత మహిళా క్రికెటర్ షఫాలీ వర్మ కూడా ఐసీసీ నెలవారీ ఉత్తమ మహిళా ఆటగాడి అవార్డును గెలుచుకుంది. గత ఏడాది నవంబరులోనూ ఆమె ఈ పురస్కారాన్ని అందుకుంది. ప్రపంచకప్ ఫైనల్లో దక్షిణాఫ్రికాపై కీలక ఇన్నింగ్స్ ఆడి భారత జట్టు విజయానికి తోడ్పడిన షఫాలీ, ఇటీవల జరిగిన పోటీల్లోనూ తన దూకుడైన ఆటను కొనసాగించింది. ఆసియా కప్‌లో షఫాలీ వర్మ 360 పరుగులు సాధించడంతో పాటు ఆరు వికెట్లు పడగొట్టింది. ఆసియా క్రీడల్లో బంగ్లాదేశ్‌తో జరిగిన మ్యాచ్‌లో శతకం సాధించగా, శ్రీలంకతో జరిగిన ఫైనల్లో 48 పరుగులు చేసింది. బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్‌లోనూ రాణించి జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించింది. మరోసారి ఐసీసీ పురస్కారం అందుకోవడం సంతోషంగా ఉందని షఫాలీ పేర్కొంది. అంతర్జాతీయ స్థాయిలో నిలకడగా రాణిస్తూ గుర్తింపు పొందడం తనకు మరింత ఉత్సాహాన్ని ఇస్తుందని తెలిపింది. గిల్, షఫాలీకి అవార్డులు దక్కడంతో భారత క్రికెట్ అభిమానుల్లో ఆనందం వ్యక్తమవుతోంది.



వెస్టిండీస్ ఆటగాళ్లకు ఐసీసీ మందలింపు

దుబాయ్, అక్టోబరు 13 **తెలంగాణ వాణి** భారత్‌తో జరిగిన రెండో టీ20 మ్యాచ్‌లో వెస్టిండీస్ జట్టు విజయం సాధించినప్పటికీ, ఆ జట్టు ఆటగాళ్లు రోవ్‌మన్ పావెల్, షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్‌లకు అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నుంచి మందలింపు ఎదురైంది. మైదానంలో ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినందుకు ఇద్దరికీ ఒక్కొక్క డీమెరిట్ పాయింట్ విధించినట్లు సమాచారం. అక్టోబరు 9న రాంచీలో భారత్, వెస్టిండీస్ జట్ల మధ్య రెండో టీ20 మ్యాచ్ జరిగింది. ఈ మ్యాచ్ సందర్భంగా వెస్టిండీస్ కెప్టెన్ రోవ్‌మన్ పావెల్ బ్యాట్‌తో బంతిని బాదిన ఘటనను ఐసీసీ పరిగణనలోకి తీసుకున్నట్లు తెలుస్తోంది. అలాగే బ్యాటర్ షెర్ఫేన్ రూథర్‌ఫర్డ్ అంపైర్ నిర్ణయంపై అసహనం వ్యక్తం చేసిన వ్యవహారంపైనా చర్యలు తీసుకున్నట్లు సమాచారం. ఈ ఘటనలకు సంబంధించి పావెల్, రూథర్‌ఫర్డ్‌లను ఐసీసీ మందలించడంతో పాటు ఇద్దరికీ చెరో డీమెరిట్ పాయింట్ కేటాయించినట్లు వార్తలు వెల్లడించాయి. అంతర్జాతీయ మ్యాచ్‌లలో ఆటగాళ్లు ఐసీసీ ప్రవర్తనా నియమావళిని తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుంది. మైదానంలో అనుచిత ప్రవర్తన, అంపైర్ల నిర్ణయాలపై అసహనం వ్యక్తం చేయడం వంటి ఘటనలపై నిబంధనలకు అనుగుణంగా క్రమశిక్షణ చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. భారత్‌పై రెండో టీ20లో విజయం సాధించిన వెస్టిండీస్‌కు ఈ పరిణామం ఎదురైంది. అయితే ఈ చర్యలపై పూర్తి వివరాలు, అధికారిక ప్రకటనకు సంబంధించిన సమాచారం స్పష్టంగా అందుబాటులోకి రావాల్సి ఉంది.

రంజీ ట్రోఫీలో అభిషేక్ పోరెల్ శతకం

కల్యాణి, అక్టోబరు 13 | తెలంగాణ వాణి బెంగాల్ వికెట్‌కీపర్ బ్యాటర్ అభిషేక్ పోరెల్ రంజీ ట్రోఫీలో అద్భుత ప్రదర్శన చేశాడు. ఢిల్లీతో జరుగుతున్న మ్యాచ్‌లో శతకంతో మెరిసిన అతడు.. సెంచరీ పూర్తి చేసిన వెంటనే భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్నాడు. ఇటీవల వ్యక్తిగత, న్యాయపరమైన సమస్యలను ఎదుర్కొన్న అనంతరం మైదానంలోకి తిరిగి వచ్చిన పోరెల్ తన బ్యాటింగ్‌తో ఆకట్టుకున్నాడు. అతడి భావోద్వేగ క్షణాలు మైదానంలో అందరి దృష్టిని ఆకర్షించాయి. ఈ సీజన్‌లో బెంగాల్ తరఫున తొలి మ్యాచ్ ఆడుతున్న 23 ఏళ్ల పోరెల్.. రెండో రోజు ఆట ముగిసే సమయానికి 137 బంతుల్లో 114 పరుగులతో అజేయంగా నిలిచాడు. మరో బ్యాటర్ సుదీప్ ఘరామి సైతం 122 పరుగులతో నాటౌట్‌గా ఉన్నాడు. వీరిద్దరూ శతకాలతో రాణించడంతో బెంగాల్ జట్టు భారీ స్కోరు సాధించింది. తొలి ఇన్నింగ్స్‌లో ఢిల్లీ జట్టు 240 పరుగులకే ఆలౌట్ అయింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన బెంగాల్ రెండో రోజు ఆట ముగిసే సమయానికి మూడు వికెట్ల నష్టానికి 304 పరుగులు చేసింది. దీంతో ప్రత్యర్థిపై 64 పరుగుల ఆధిక్యాన్ని సాధించింది. కీలక సమయంలో పోరెల్, ఘరామి జట్టును పటిష్ఠ స్థితిలో నిలిపారు. ఫస్ట్‌క్లాస్ క్రికెట్‌లో తన రెండో శతకాన్ని పూర్తి చేసిన వెంటనే పోరెల్ మోకాళ్లపై కూర్చొని కన్నీళ్లు పెట్టుకున్నాడు. కొద్దిసేపటి తర్వాత తేరుకుని బ్యాట్‌ను పైకెత్తి అభివాదం చేశాడు. ఈ దృశ్యం ప్రేక్షకులను ఆకట్టుకుంది. మ్యాచ్ అనంతరం పోరెల్ మాట్లాడుతూ.. తాను తెలియకుండానే భావోద్వేగానికి గురయ్యానని తెలిపినట్లు కథనాలు పేర్కొన్నాయి. మాటలతో కాకుండా తన ఆటతోనే సమాధానం చెప్పాలనుకుంటున్నట్లు



వెల్లడించాడు. కష్టకాలంలో తనకు అండగా నిలిచిన కోచ్ లక్ష్మీ రతన్ శుక్లా, ఇతరులకు కృతజ్ఞతలు తెలిపాడు. కర్ణాటకకు చెందిన ఓ వైద్య విద్యార్థిని పెళ్లి పేరుతో మోసం చేశాడని, అత్యాచారం, బెదిరింపులకు పాల్పడ్డాడని ఆరోపిస్తూ పోరెల్‌పై ఫిర్యాదు చేసినట్లు వార్తలు వచ్చాయి. ఈ ఫిర్యాదు నేపథ్యంలో ఆగస్టు 11న పోలీసులు అతడిని అరెస్టు చేసినట్లు కథనాలు వెల్లడించాయి. నెల రోజులకు పైగా జైలులో ఉన్న అనంతరం సెప్టెంబరులో చిన్నస్వామి కోర్టు నుంచి బెయిల్ పొందినట్లు సమాచారం. అయితే, తనపై వచ్చిన ఆరోపణలను పోరెల్ ఖండించినట్లు కథనాలు పేర్కొన్నాయి. ఈ ఆరోపణలు న్యాయపరమైన విచారణకు సంబంధించినవి కావడంతో, వాటిని నిర్ధారిత నేరాలుగా పరిగణించరాదు. బెయిల్‌పై విడుదలైన తర్వాత పోరెల్‌కు బెంగాల్ రంజీ జట్టులో చోటు దక్కింది. అతడి వ్యక్తిగత, న్యాయపరమైన వ్యవహారాలు తమ పరిధిలోకి రావని, జట్టు ఎంపికలో అతడిని పరిగణనలోకి తీసుకున్నామని బెంగాల్ క్రికెట్ సంఘం తెలిపినట్లు సమాచారం. ఢిల్లీతో మ్యాచ్‌లో శతకం సాధించడం ద్వారా పోరెల్ తన క్రికెట్‌పై దృష్టి సారించాడు. అతడి ప్రదర్శన బెంగాల్ జట్టుకు కీలకంగా మారింది.

ప్రపంచకప్ జట్టులో కోహ్లీ, రోహిత్‌కు చోటు దక్కేనా?

న్యూఢిల్లీ, అక్టోబరు 13 **తెలంగాణ వాణి** 2027 వన్డే ప్రపంచకప్‌లో భారత స్టార్ క్రికెటర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ ఆడతారా? ఈ ఇద్దరు సీనియర్ ఆటగాళ్ల భవిష్యత్తుపై కొంతకాలంగా చర్చ జరుగుతోంది. ఈ నేపథ్యంలో భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అధ్యక్షుడు మిథున్ మన్హాస్ కీలక వ్యాఖ్యలు చేశారు. జట్టు ఎంపికలో వయసు కంటే ఆటగాళ్ల ఫిట్‌నెస్, ప్రదర్శనకే ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. అయితే, తుది నిర్ణయం సెలెక్టర్లు, కోచ్‌లదేనని పేర్కొన్నారు. 2027 వన్డే ప్రపంచకప్ దక్షిణాఫ్రికా, జింబాబ్వే, నమీబియా వేదికలుగా జరగనుంది. ఈ మెగా టోర్నీలో భారత్ తరఫున ఎవరు బరిలోకి దిగుతారన్న అంశంపై ఇప్పటి నుంచే ఆసక్తి నెలకొంది. ముఖ్యంగా వయసు పెరుగుతున్న కోహ్లీ, రోహిత్ జట్టులో కొనసాగుతారా? అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ఈ అంశంపై స్పందించిన మిథున్ మన్హాస్.. ప్రపంచకప్ జట్టు ఎంపికపై బీసీసీఐ నేరుగా నిర్ణయం తీసుకోదని, సెలెక్టర్లు, కోచ్‌లు ఆటగాళ్ల ప్రదర్శనను పరిశీలించి తుది నిర్ణయం తీసుకుంటారని వివరించినట్లు సమాచారం. ఆటగాడి వయసును మాత్రమే ప్రమాణంగా తీసుకోకుండా, అతడి ఫిట్‌నెస్, ఆటతీరు, జట్టుకు అందించే సహకారాన్ని పరిగణనలోకి తీసుకోవాలని అభిప్రాయపడ్డారు. జట్టు విజయాల్లో కీలక పాత్ర పోషించే సామర్థ్యం ఉన్నవారికి వయసు అడ్డంకి కాకూడదన్నది ఆయన వ్యాఖ్యల సారాంశం. భారత వన్డే కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌కు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, హార్దిక్ పాండ్యా వంటి అనుభవజ్ఞుల సహకారం ఎంతో ఉపయోగపడుతుందని మన్హాస్ అభిప్రాయపడినట్లు తెలుస్తోంది. కీలక మ్యాచ్‌ల్లో ఒత్తిడిని ఎదుర్కొన్న సీనియర్ ఆటగాళ్ల అనుభవం జట్టుకు బలాన్నిస్తుందని భావిస్తున్నారు.



అదే సమయంలో జస్‌ప్రీత్ బుమ్రా వంటి బౌలర్లు బౌలింగ్ విభాగంలో కీలక బాధ్యతలు చేపట్టగలరని పేర్కొన్నారు. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్ విభాగాల్లో ఆటగాళ్లు తమ బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తే ప్రపంచకప్ వంటి పెద్ద టోర్నీల్లో విజయావకాశాలు మెరుగుపడతాయని విశ్లేషించారు. మాజీ భారత క్రికెటర్ మహమ్మద్ కైఫ్ కూడా 2027 ప్రపంచకప్ సన్నద్ధతపై తన అభిప్రాయాలను వెల్లడించారు. దక్షిణాఫ్రికా పిచ్‌లు బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండే పరిస్థితుల్లో బౌలర్ల నాణ్యత కీలకంగా మారుతుందని ఆయన పేర్కొన్నట్లు సమాచారం. ప్రత్యర్థి జట్లను తక్కువ స్కోరుకే పరిమితం చేయడంతో పాటు కీలక సమయాల్లో వికెట్లు తీయగల బౌలింగ్ విభాగం అవసరమని అభిప్రాయపడ్డారు. ప్రపంచకప్‌ను గెలవాలంటే భారత్ బౌలింగ్‌తో పాటు ఫీల్డింగ్‌పైనా ప్రత్యేక దృష్టి పెట్టాలని కైఫ్ సూచించారు. పరుగులను అడ్డుకోవడం, కీలక క్యాచ్‌లను అందుకోవడం, ఒత్తిడిలో తప్పిదాలను తగ్గించుకోవడం విజయానికి దోహదపడతాయని పేర్కొన్నారు. మొత్తంగా 2027 ప్రపంచకప్‌లో కోహ్లీ, రోహిత్ ఆడే అంశంపై ఇంకా స్పష్టత రాలేదు. వారి ప్రస్తుత ఫిట్‌నెస్, ప్రదర్శన, జట్టు అవసరాలను బట్టి ఎంపికపై నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది. తుది జట్టు కూర్పుపై అధికారిక ప్రకటన వెలువడే వరకు ఈ అంశంపై ఉత్కంఠ కొనసాగనుంది.

టీమిండియాలోకి ఔకిబ్ నబీ.. కారు కొనుగోలుపై చర్చ!

గువాహటి, అక్టోబరు 13 **తెలంగాణ వాణి** జమ్మూకశ్మీర్‌కు చెందిన యువ క్రికెటర్ ఔకిబ్ నబీ భారత జట్టు తరఫున అంతర్జాతీయ క్రికెట్‌లోకి అరంగేట్రం చేశాడు. భారత్, వెస్టిండీస్ మధ్య జరిగిన వన్డే సిరీస్‌లో భాగంగా గువాహటిలోని బర్సాపరా క్రికెట్ స్టేడియంలో జరిగిన రెండో వన్డేలో టీమిండియా తరఫున తొలి మ్యాచ్ ఆడాడు. భారత స్టార్ బ్యాటర్ కేఎల్ రాహుల్ చేతుల మీదుగా జాతీయ జట్టు టోపీని అందుకున్నాడు. దీంతో జమ్మూకశ్మీర్ నుంచి భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించిన మూడో క్రికెటర్‌గా నిలిచాడు. గతంలో పర్వేజ్ రసూల్, ఉమ్రాన్ మాలిక్ ఈ ఘనత సాధించారు.

షోరూమ్‌లో కారు.. సామాజిక మాధ్యమాల్లో చర్చ

అంతర్జాతీయ క్రికెట్‌లోకి అడుగుపెట్టిన ఔకిబ్ నబీకి సంబంధించిన ఓ వీడియో ప్రస్తుతం సామాజిక మాధ్యమాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆ వీడియోలో అతడు ఓ కార్ల ప్రదర్శనశాలలో హ్యుందాయ్ కారులో కూర్చొని కనిపించాడు. దీంతో నబీ కొత్త కారు కొనుగోలు చేశాడంటూ పలువురు అభిమానులు ఊహాగానాలు చేస్తున్నారు. అయితే, అతడు నిజంగానే కారును కొనుగోలు చేశాడా? అనే విషయంపై స్పష్టమైన సమాచారం లేదు.

అరంగేట్ర మ్యాచ్‌లో నిరాశాజనక ప్రదర్శన

భారత జట్టులో చోటు దక్కించుకున్నప్పటికీ, తొలి వన్డేలో నబీకి కఠిన పరీక్ష ఎదురైంది. బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉన్న పిచ్‌పై బౌలింగ్ చేసిన అతడు 8.4 ఓవర్లలో 84 పరుగులు సమర్పించుకున్నాడు. ఒక్క వికెట్ కూడా తీయలేకపోయాడు. అంతర్జాతీయ క్రికెట్‌లో తొలి మ్యాచ్ కావడంతో అతడిపై అంచనాలు నెలకొన్నప్పటికీ, బౌలింగ్‌లో ఆశించిన స్థాయిలో రాణించలేకపోయాడు. భారత వన్డే జట్టుకు ఎంపిక కావడంతో నబీ ఇటీవల జరిగిన ఇరానీ కప్ మ్యాచ్‌కు జమ్మూకశ్మీర్ తరఫున అందుబాటులో లేకపోయాడు. ఆ మ్యాచ్‌లో జమ్మూకశ్మీర్ జట్టు రెస్ట్ ఆఫ్ ఇండియా చేతిలో 167 పరుగుల తేడాతో ఓటమి పాలైంది.

రంజీ ట్రోఫీలో 60 వికెట్లు

2025-26 రంజీ ట్రోఫీ సీజన్‌లో ఔకిబ్ నబీ అద్భుతంగా రాణించాడు. ఏకంగా 60 వికెట్లు పడగొట్టి జమ్మూకశ్మీర్ జట్టు తొలిసారి రంజీ ట్రోఫీ టైటిల్ సాధించడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ ప్రదర్శనతో అతడికి భారత టెస్టు జట్టులోనూ అవకాశం దక్కవచ్చనే అంచనాలు ఏర్పడ్డాయి. ఆగస్టులో శ్రీలంకతో జరిగిన టెస్టు సిరీస్ కోసం ఎంపిక చేసిన భారత జట్టులోనూ నబీకి చోటు లభించింది. భారత్ ఆ సిరీస్‌ను 1-0తో గెలుచుకున్నప్పటికీ, తుది జట్టులో ఆడే అవకాశం అతడికి రాలేదు. అనంతరం ఇంగ్లాండ్ కౌంటీ ఛాంపియన్‌షిప్‌లో సర్రే జట్టు తరఫున ఆడాడు.

సెలెక్టర్ల దృష్టిలో నబీ ప్రదర్శన

అంతర్జాతీయ స్థాయిలో తొలి మ్యాచ్ ఆడిన నబీ, రాబోయే పోటీల్లో తన బౌలింగ్‌తో ఆకట్టుకోవాల్సి ఉంది. అతడి ప్రదర్శనను భారత సెలెక్టర్లు పరిశీలించే అవకాశం ఉంది. భారత్-ఎ జట్టు న్యూజిలాండ్ పర్యటనతో పాటు రానున్న టెస్టు సిరీస్‌ల కోసం జట్ల ఎంపిక నేపథ్యంలో దేశవాళీ, అంతర్జాతీయ క్రికెట్‌లో అతడి ప్రదర్శన కీలకం కానుంది. రంజీ ట్రోఫీలో వికెట్ల వేటతో గుర్తింపు పొందిన నబీ, భారత జట్టులో తన స్థానాన్ని నిలబెట్టుకుంటాడా అనేది ఆసక్తికరంగా మారింది.





డ్యాన్స్ షో ఆఫర్ వస్తే అనుపమ పరమేశ్వరన్ షాకయ్యిందట.. ఎందుకో తెలుసా.. ?

రింగురింగుల జుట్టుతో కుర్రకారు మనసులో చెరగని ముద్రవేసుకుంది కేరళ చిన్నది అనుపమ పరమేశ్వరన్. మలయాళంతోపాటు తెలుగు, తమిళ భాషల్లో స్టార్ యాక్టర్లతో కలిసి నటిస్తూ సూపర్ ఫ్యాన్ బేస్ సంపాదించుకుంది. ఈ బ్యూటీని ఒక ఆఫర్ సర్‌ప్రైజ్ చేసిందట. ఇంతకీ ఏ సినిమానో అనుకుంటున్నారా..? కాదండి.. అనుపమకు ఓ పాపులర్ డ్యాన్స్ రియాలిటీ షో నుంచి ఆఫర్ వచ్చింది. తెలుగు రియాలిటీ డ్యాన్స్ షో 'ఢీ' నయా సీజన్‌కు జడ్జిగా చేయాలని ఆఫర్ రావడంతో షాకయ్యానని చెప్పింది అనుపమ. ఈ విషయమై ఓ ఇంటర్వ్యూలో అనుపమ మాట్లాడుతూ.. సినిమాలకు అతీతంగా కొత్త అవకాశాలను అన్వేషించడం తనకు ఇష్టమని చెప్పింది. సినిమాలో తన మార్క్ చూపించిన తర్వాత షార్ట్ ఫిల్మ్, మ్యూజిక్ వీడియోల్లో నటించే అవకాశాలు వచ్చాయని... ఢీ షోకు జడ్జిగా చేయాలనే ఆఫర్ వస్తుందని తానెప్పుడు ఊహించలేదని, డిఫరెంట్ ఫార్మాట్లలో ప్రయోగాలు చేయడాన్ని ఎంజాయ్ చేయడం వల్ల తాను షో చేసేందుకు ఒప్పుకున్నానని చెప్పుకొచ్చింది. ఎప్పుడైనా కొంతగా ప్రయత్నించే ఆసక్తికరమైన అవకాశాలు వస్తే స్వీకరించేందుకు సిద్ధంగా ఉన్నానంది అనుపమ. డ్యాన్స్ షోకు జడ్జిగా చేయాలని అనుపమ నిర్ణయించుకోవడం కొత్త అనుభవాలను ఆవిష్కరించుకోవాలనే తన తపనను ప్రతిబింబిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు. మరి డ్యాన్స్ రియాలిటీ షోకు జడ్జిగా ప్రేక్షకుల దగ్గర అనుపమ ఎలాంటి మార్కులు కొట్టేస్తుందనేది చూడాలి.



'మండాడి' తర్వాత సుహాస్ కొత్త సినిమా ఇదే

మండాడితో మంచి విజయాన్ని అందుకున్న సుహాస్ మరో సినిమాతో ప్రేక్షకుల ముందుకు రానున్నాడు. సుహాస్ ప్రధాన పాత్రలో, రాజేంద్ర బాల దర్శకత్వంలో ఓ సినిమా రూపొందుతోంది. సంజనా కృష్ణమూర్తి కథానాయిక. కార్తికేయన్ సంతానం, వార్తికా జైన్ నిర్మిస్తున్నారు. తాజాగా ఈ మూవీ టైటిల్‌ని 'హైడ్ అండ్ సిల్క్'గా ఖరారు చేసింది చిత్రబృందం. ఈ మేరకు సోషల్ మీడియాలో టైటిల్ ప్రోమోను విడుదల చేసింది. సుహాస్-సంజన ప్రేమ చిగురించిందని తెలుపుతూ.. విడుదల చేసిన ఫస్ట్ లుక్ పోస్టర్ సోషల్ మీడియాలో అందరినీ ఆకర్షిస్తోంది. ఈ సినిమాలో సుహాస్ సరసన సంజన కృష్ణమూర్తి హీరోయిన్‌గా నటిస్తున్నారు. తనికెళ్ల భరణి, నందు కీలక పాత్రలో కనిపించనున్నారు. ఈ సినిమాతోనే రాజేంద్ర బాల దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. తెలుగు, తమిళ భాషల్లో త్వరలోనే విడుదల కానుంది.

ట్వీట్‌తో క్లారిటీ

అల్లు అర్జున్ ప్రస్తుతం అట్లీ దర్శకత్వంలో 'రాకా' చేస్తున్నాడు. దీని తర్వాత లెక్క ప్రకారం లోకేశ్ కనగరాజ్‌తో కలిసి మూవీ చేయాలి. చాన్నాళ్ల క్రితమే ఈ ప్రాజెక్ట్ గురించి ప్రకటన వచ్చింది. అనౌన్స్‌మెంట్ వీడియోని కూడా రిలీజ్ చేశారు. అప్పటినుంచి టీమ్ సైలెంట్ అయిపోయేసరికి మూవీ ఆగిపోయిందని పుకార్లు షికారు చేశాయి. గత కొన్నిరోజుల నుంచి ఈ వార్తలు తెగ వైరల్ అయ్యాయి. దీంతో అంతా ఇది నిజమేనేమో అనుకుంటున్నారు. ఇలాంటి టైంలో ఒక్క ఫొటోతో లోకేశ్ క్లారిటీ ఇచ్చేశాడు. 'ఇంట్రెస్టింగ్ అప్‌డేట్స్ త్వరలోనే' అని ట్వీట్ చేసిన దర్శకుడు లోకేశ్ కనగరాజ్.. బన్నీతో కలిసి మాట్లాడుతున్న లేటెస్ట్ ఫొటోని పోస్ట్ చేశాడు. దీంతో ఈ ప్రాజెక్ట్‌పై వార్తలన్నీ రూమర్స్ అని తేలిపోయాయి. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మిస్తుండగా.. అనిరుధ్ సంగీతమందిస్తున్నాడు. వచ్చే ఏడాది ఫిబ్రవరి నుంచి షూటింగ్ మొదలయ్యే అవకాశమున్నట్లు తెలుస్తోంది. ఇతర వివరాలు ఏంటనేది టీమ్ నుంచి ప్రకటన రావాల్సి ఉంది.




మైత్రీ ఇన్ లవ్.. హీరోయిన్‌గా సడన్ సర్‌ప్రైజ్



ఒకప్పుడు హీరోగా ఎన్నో సినిమాలు చేసి ప్రస్తుతం సహాయ నటుడు, విలన్ పాత్రలు చేస్తున్న శ్రీకాంత్.. తన వారసుల్ని ఒక్కొక్కరిగా ఇండస్ట్రీలోకి తీసుకొస్తున్నాడు. ఇప్పటికే కొడుకు రోషన్.. హీరోగా మూడు మూవీస్ చేశాడు. 'ఏమో ఏమో ఇది' అని ఓ చిత్రం చేస్తున్నాడు. మరోవైపు శ్రీకాంత్ కూతురు మేధ కూడా హీరోయిన్ అయిపోయింది. ఈ మేరకు ప్రకటన చేశారు.మైత్రీ మూవీస్ నిర్మాణ సంస్థ తీస్తున్న ఓ ప్రేమకథా సినిమాతో మేధా.. హీరోయిన్‌గా పరిచయమవుతోంది. జై జాస్తి అనే కుర్రాడు హీరోగా ఎంట్రీ ఇస్తున్నాడు. ఇతడు గతంలో 'రాజమండ్రి రోజ్ మిల్క్' అనే మూవీ చేశాడు గానీ అది రిలీజ్ కాలేదు. ఇప్పుడు వీళ్లిద్దరూ రొమాంటిక్‌గా ఉన్న ఓ పోస్టర్ రిలీజ్ చేసి త్వరలో ఇతర వివరాలు వెల్లడించనున్నట్లు చెప్పారు. '30 వెడ్స్ 21' అనే యూట్యూబ్ సిరీస్ తీసిన పృథ్వీ వానం ఈ సినిమాకు దర్శకుడు కాగా 'ఆంధ్రా కింగ్ తాలుకా' మూవీ తీసిన దర్శకుడు మహేశ్ బాబు.. ఈ చిత్రానికి స్టోరీ అందించాడు. శ్రీకాంత్ ఫ్యామిలీలో శ్రీకాంత్ హీరో కాగా ఇతడి భార్య ఊహ కూడా గతంలో హీరోయిన్‌గా చేసింది. ఇప్పుడు వారసుల్ని కూడా ఈ జంట.. ఇండస్ట్రీలోకి తీసుకొస్తున్నారు.

సర్దార్ డైరెక్టర్‌తో యశ్ సినిమా.. క్రేజీ టాక్ నిజమయ్యేనా..?

కార్తీ హీరోగా నటించిన సర్దార్ సినిమాతో మంచి హిట్ అందుకున్నాడు కోలీవుడ్ డైరెక్టర్ పీఎస్ మిత్రన్. అయితే భారీ అంచనాల మధ్య వచ్చిన సీక్వెల్ ప్రాజెక్ట్ సర్దార్ 2 మాత్రం బాక్సాఫీస్ వద్ద ఢీలా పడిపోయింది. తాజాగా ఈ తమిళ దర్శకుడికి సంబంధించిన క్రేజీ వార్త ఒకటి నెట్టింట రౌండప్ చేస్తోంది. పీఎస్ మిత్రన్ ఇండియానా జోన్స్ ఫ్రాంచైజీ స్ఫూర్తిగా ఓ ఎక్సయిటింగ్ అడ్వెంచరస్ ఫిల్మ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నాడట. ఇందులో కన్నడ స్టార్ యాక్టర్ యశ్ హీరోగా కనిపించబోతున్నాడట. తాజా టాక్ ప్రకారం పీఎస్ మిత్రన్ యశ్ కథ వినిపించగా.. సినిమా ఐడియా యశ్‌కు బాగా నచ్చిందని ఇన్‌సైడ్ టాక్. ఇందులో యశ్ చాలా కొత్త గెటప్‌లో కనిపించబోతున్నాడట. అన్నీ అనుకున్నట్టుగా కుదిరితే ఈ ఇద్దరి కాంబో సెట్స్‌పైకి వెళ్లడం పక్కా అని తెలుస్తోండగా.. దీనికి సంబంధించి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది. యశ్ ప్రస్తుతం నితేశ్ తివారి తెరకెక్కిస్తున్న రామాయణ సినిమాలో నటిస్తున్నాడు. ఇందులో రావణుడిగా కనిపించబోతున్నాడు యశ్. దీంతోపాటు యశ్ ప్రస్తుతమున్న ఇతర సినిమాల కమిట్‌మెంట్స్ పూర్తి చేసిన తర్వాత పీఎస్ మిత్రన్ ప్రాజెక్టు ముందుకు కదలనుందనే చర్చ నడుస్తోంది. మరి యశ్-పీఎస్ మిత్రన్ కాంబినేషన్ సిల్వర్ స్క్రీన్‌పైకి రావాలంటే ఎన్నాళ్లు వేచి ఉండాలో మరి.





Printed, Published & Owned by JERIPOTHULA SAMPATH, Printed at SRI BALAJI, H.No. 4-4-85, Tilak road, District Karimnagar. 505 001 (T.S)Published at H.No. 3-6-307, Subhash Nagar, Karimnagar MDI: District, Karimnagar -505 001 (T.S) Editor: JERIPOTHULA SAMPATH, RNI NO. APTEL/2012/53127 CELL:9912758107, telanganavanil@gmail.com